

జీవించేందుకే మనిషి తినాలి

సమాజ సంక్షేమానికి జీవించాలి

- డాక్టర్ బిఆర్ అంబేద్కర్

REGD NO : APTEL 16144

# జన స్వరం

పవర్

అక్షరమే ఆయుధం

www.janaswaram.com

## పాఠకులకు విజ్ఞప్తి

జనస్వరం న్యూస్ తెలుగు దినపత్రిక నందు తక్కువ ఖర్చుతో పుట్టినరోజు శుభాకాంక్షలతో పాటు అన్ని కార్యక్రమాలకు ప్రకటనలకు సంప్రదించండి. మా మెయిల్ ఐడీ :

janaswaramnews@gmail.com

మొబైల్ నెంబర్ : 7013030690

సంపుటి : 4 | సంచిక : 300 | ఎడిటర్ : నరేష్ సాకే | తేది : 14-05-2025 | పేజీలు : 6

# లోతైన అధ్యయనంతోనే రాష్ట్ర ఆదాయంలో పెరుగుదల

- 30 ఏళ్ల ఫలితాల ఆధారంగా ప్రణాళికలు సిద్ధం చేయండి
- ఈ ఏడాది రూ.1,34,208 కోట్ల ఆదాయం లక్ష్యం
- సాంకేతికత వినియోగంతో పన్ను ఎగవేతలకు చెక్
- అంతర్జాతీయంగా ఎర్రచందనం విక్రయాలకు కమిటీ ఏర్పాటు
- ఆదాయార్జన శాఖల సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు



**అమరావతి, మే 13 (జనస్వరం) :** రాష్ట్ర ఆదాయం మరింతగా పెంచేందుకు ఉన్న అనుకూలతలు, వేగంగా వృద్ధి చెందడానికి గల అవకాశాలపై ఆదాయార్జన శాఖలన్నీ లోతైన అధ్యయనం చేయాలని... అంతిమంగా రాష్ట్ర ఆదాయం భారీఎత్తున పెరిగేలా చూడాలని అధికారులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. గడిచిన 30 ఏళ్ల ఆదాయ ఫలితాలను పరిశీలించి భవిష్యత్ ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ సొంత ఆదాయం పెంచుకునేందుకు ఎలక్ట్రానిక్స్, ఐటీ, సేవల రంగాలు ఎక్కువగా దోహదం చేస్తాయని ముఖ్యమంత్రి అన్నారు. మంగళవారం సచివాలయంలో ఆదాయార్జన శాఖలపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. సమీక్షలో శాఖల వారీ పురోగతిపై చర్చించారు. మరోవైపు బంగారం అత్యధికంగా కొనుగోలు చేస్తున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ముందున్నప్పటికీ... పన్ను ఆదాయం ఆస్థాయిలో ఎందుకు లేదో అధికారులు దృష్టి పెట్టాలని... పన్ను ఎగవేతలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని శాఖల సమాచారంతో డేటా లేక్ ఏర్పాటు చేయాలని... ప్రతిశాఖకు ఏఐ బృందం ఉండాలని ముఖ్యమంత్రి చెప్పారు. పన్ను చెల్లింపుదారులకు ఏఐ టూల్ ద్వారా సేవలు అందించేలా వచ్చే రెండు, మూడు నెలల్లో ఏఐ ఆధారిత పన్నుల వ్యవస్థను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు.

**మద్యం సరఫరా, అమ్మకాల ట్రాకింగ్ :**

పొరుగు రాష్ట్రాల నుంచి మద్యం అక్రమంగా రాష్ట్రంలో విక్రయించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో మద్యం విక్రయాలు పారదర్శకంగా జరిగేలా సరఫరా దగ్గర నుంచి అమ్మకం వరకు... ప్రతీది రియల్ టైమ్‌లో ట్రాక్ చేయాలని చెప్పారు. కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల్లో రవాణా శాఖ ఆదాయం పెరుగుతుంటే... ఆంధ్రప్రదేశ్‌లో ఎందుకు తక్కువుగా ఆదాయం వస్తోందని ముఖ్యమంత్రి అధికారులను ప్రశ్నించారు. దీనికి కారణాలు అన్వేషించి వెంటనే, సరైన విధానాలను అవలంభించి ఆదాయం పెరిగేలా చూడాలని చెప్పారు. నెలవారీ లక్ష్యాలను అధిగమించేలా ఆదాయార్జన శాఖలు ప్రయత్నించాలని అన్నారు.

**ఎర్రచందనం నిల్వలపై సమగ్ర అధ్యయనం :**

రాష్ట్రంలో ఎర్రచందనం నిల్వలను అంతర్జాతీయ మార్కెట్‌లో విక్రయించేలా కమిటీ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. వేల కోట్ల రూపాయల విలువైన ఎర్రచందనం మన రాష్ట్రానికి మాత్రమే సొంతమని... దీనిని విక్రయించడం ద్వారా పెద్దఎత్తున ఆదాయం ఆర్జించవచ్చన్నారు. రాష్ట్రంలో ఎన్ని టన్నుల ఎర్రచందనం నిల్వలు ఉన్నాయి.. వాటి విలువ ఎంత అనేదానిపై కమిటీ స్పష్టమైన నివేదిక ఇవ్వాలని చెప్పారు.

**29 శాతం అధికంగా ఆదాయార్జన లక్ష్యం :**

వాణిజ్య పన్నులు, ఎక్సైజ్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, గనులు, అటవీ.. ఇలా అన్ని రకాల ఆదాయాలు కలిపి 2025-26 సంవత్సరానికి రాష్ట్ర సొంత ఆదాయం రూ.1,34,208 కోట్లు ఆర్జించాలని లక్ష్యం పెట్టుకున్నారు. ఇది గత ఏడాది కన్నా 29 శాతం అధికం. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 1 నుంచి మే 11 వరకు వాణిజ్య పన్నులు, అటవీ ఆదాయంలో తగ్గుదల కనిపించగా, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ నుంచి అనూహ్యంగా ఆదాయం పెరిగింది. అటు, ఈ ఆర్థిక సంవత్సరం మే 11 వరకు కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆదాయం గతేడాది కన్నా 26 శాతం తగ్గింది. 2024-25లో ఇదే కాలానికి కేంద్రం నుంచి రూ.17,170 కోట్లు రాగా... ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.12,717 కోట్లు మాత్రమే వచ్చింది అని అధికారులు వివరించారు.

**కొత్త ఎక్సైజ్ పాలసీతో పెరిగిన ఆదాయం :**

రాష్ట్రంలో కొత్తగా తీసుకువచ్చిన ఎక్సైజ్ పాలసీతో ఆదాయంలో వృద్ధి నమోదైంది. 2024-25లో రాష్ట్రానికి ఎక్సైజ్ ఆదాయం రూ.28,842 కోట్లు వచ్చింది. ఇది అంతకుముందు ఏడాది కన్నా 14.84 శాతం ఎక్కువ. అయితే దక్షిణాది రాష్ట్రాలైన తెలంగాణ, తమిళనాడు, కర్నాటకతో పోల్చుకుంటే ఏపీలో ఎక్సైజ్ ఆదాయం ఇప్పటికీ తక్కువగానే ఉంది. 2025-26 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నెలలో రాష్ట్రానికి రూ.2,116 కోట్ల ఆదాయం రాగా, ఈ ఏడాది మొత్తం ఎక్సైజ్ ద్వారా రూ.33,882 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నట్లు అధికారులు వివరించారు.

**హైదరాబాద్ లేని లోటు పూడ్చు కోవాలి :**


తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ నుంచే 75 శాతం ఆదాయం వస్తుందని.. మనకు అటువంటి అవకాశం లేనందున ఆదాయం పెంచుకునే మార్గాలను అన్వేషించాలని సిఎం చంద్రబాబు అన్నారు. ఏడాది కాలంలో తీసుకువచ్చిన పాలసీలను పటిష్టంగా అమలు చేయడం ద్వారా రాష్ట్ర ఆదాయం పెరిగేలా చూడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సొంత ఆదాయ వనరులు పెంచుకుని తన కాళ్లపై తాను నిలబడాల్సిన అవసరం ఉందని...అప్పుడే అభివృద్ధి, సంక్షేమ పథకాలకు విరివిగా నిధులు ఖర్చు చేయగలం అని సిఎం అన్నారు. కేంద్ర సాయం, అప్పులు అనేది ప్రాథమిక దశలో నిలబడేందుకు మాత్రమే ఉపయోగపడతాయని.. మంచి పనితీరు ద్వారా ఆయా శాఖల్లో ఆదాయం పెరిగే ప్రణాళికలు అమలు చేయాలని సిఎం అధికారులకు స్పష్టం చేశారు. ఒకటి రెండు శాఖలు ఏడాది కాలంలో అనుకున్నంత పురోగతి సాధించలేదని.. ఆయా శాఖల పనితీరు మెరుపడాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి తెలిపారు.

# 19న డిప్యూటీ మేయర్ ఎన్నిక

- పదవి కోసం ఆశావహుల ముమ్మర ప్రయత్నాలు
- ఎంపికలో సామాజికవర్గాల సమీకరణలే కీలకం
- యాదవ, కాపు సామాజికవర్గాల మధ్యే పోటీ
- ఎవరికివారు ముమ్మర ప్రయత్నాలు
- ఏం చేయాలనేదానిపై తలలుపట్టుకుంటున్న మేయర్, ప్రజాప్రతినిధులు
- ముఖ్యమంత్రి వద్దకు చేరిన పంచాయితీ
- నేడు చంద్రబాబును కలవనున్న మేయర్, నగర ఎమ్మెల్యేలు

**విశాఖపట్నం, మే 13 (జనస్వరం) :** మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ) డిప్యూటీ మేయర్ పదవి కోసం కూటమి కార్పొరేటర్లలో పలువురు పోటీపడుతున్నారు. తమకు సన్నిహితంగా ఉండే ప్రజాప్రతినిధులు, నాయకుల ద్వారా ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో డిప్యూటీ మేయర్ ఎంపికను సీఎం చంద్రబాబునాయుడుకు విడిచిపెట్టేయాలని మేయర్‌తోపాటు ప్రజా ప్రతినిధులు నిర్ణయించారు. ఈ విషయమై అమరావతిలో బుధవారం సీఎంతో జరిగే సమావేశం కోసం మేయర్‌తోపాటు ఎమ్మెల్యేలంతా మంగళవారం రాత్రి బయలుదేరి వెళ్లారు. జీవీఎంసీ మేయర్ గొలగాని హరి వెంకటకుమారితోపాటు డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌పై కూటమి కార్పొరేటర్లు అవిశ్వాస తీర్మానం పెట్టడంతో ఇద్దరూ పదవి కోల్పోయారు. కొత్త మేయర్‌గా టీడీపీకి చెందిన 96వ వార్డు కార్పొరేటర్ పీలా శ్రీనివాసరావు ఎన్నికవ్వగా, డిప్యూటీ మేయర్ ఎన్నిక ఈ నెల 19న జరగాల్సి ఉంది. డిప్యూటీ మేయర్ పదవి కోసం పలువురు కార్పొరేటర్లు పోటీపడుతున్నారు. మేయర్ పదవి నుంచి తప్పించిన గొలగాని హరివెంకటకుమారి యాదవ సామాజిక వర్గానికి చెందినవారు అయినందున... డిప్యూటీ మేయర్ పదవిని తమకు కేటాయించాలని ఆ సామాజిక వర్గానికి చెందిన కార్పొరేటర్లు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో సామాజిక వర్గం నుంచి ఒత్తిడిని ఎదుర్కొనాల్సి వస్తుందని ప్రజాప్రతినిధుల ముందు వాదన వినిపిస్తున్నారు. డిప్యూటీ మేయర్ పదవి కోసం యాదవ సామాజిక వర్గం నుంచి ఐదో వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత, 18వ వార్డు కార్పొరేటర్ గొలగాని మంగవేణితోపాటు 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ పోటీ పడుతున్నారు. వైసీపీ నుంచి కార్పొరేటర్‌గా గెలిచి, స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా ఉంటూనే సాధారణ ఎన్నికలకు ముందు టీడీపీలో చేరిన 29వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి నారాయణరావు కూడా ఈ పదవిని తనకు ఇవ్వాలని పట్టుబడుతున్నారు. ఇదిలావుండగా కాపు సామాజిక వర్గానికి చెందిన జియ్యాని శ్రీధర్‌ను పదవి నుంచి తొలగించినందున అదే వర్గానికి చెందిన వారికి కేటాయించడం ద్వారా సామాజిక సమతుల్యాన్ని పాటించాలని ఆ సామాజిక వర్గానికి చెందిన కార్పొరేటర్లు పట్టుబడుతున్నారు. ప్రధానంగా 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, 97వ వార్డు కార్పొరేటర్ సేనాపతి వసంత, 94వ వార్డు కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావులు డిప్యూటీ మేయర్ పోస్టు కోసం తమవంతు ప్రయత్నాలను ముమ్మరంగా సాగిస్తున్నారు. పార్టీలో సీనియారిటీని, జీవీఎంసీలో గత నాలుగేళ్ల వైసీపీ పాలనపై కౌన్సిల్‌లో పోరాటం చేయడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటే గంధం శ్రీనివాసరావుకు అవకాశం దక్కడం ఖాయమని పార్టీ నేతలు చెబుతున్నారు. కానీ యాదవ సామాజిక వర్గ మహిళను మేయర్ పదవి నుంచి అవిశ్వాసం ద్వారా తొలగించినందున తిరిగి అదే సామాజిక వర్గం నుంచి మహిళను మేయర్ పదవికి ఎంపిక చేయాల్సి ఉన్నప్పటికీ ప్రత్యేక పరిస్థితులు, పార్టీ పట్ల విధేయతను చూపడాన్ని దృష్టిలో పెట్టుకుని గవర సామాజిక వర్గానికి చెందిన పీలా శ్రీనివాసరావుకు అవకాశం ఇచ్చినందున... కనీసం డిప్యూటీ మేయర్ పదవిని యాదవ వర్గానికి చెందిన మహిళకు కేటాయిస్తే బాగుంటుందని కొందరు ప్రజాప్రతినిధులు అభిప్రాయపడుతున్నారు. దీనిని కొందరు ఎమ్మెల్యేలు కూడా సమర్థిస్తుండడంతో యాదవ వర్గానికి చెందిన మహిళకు పదవిని కేటాయించడం దాదాపు ఖాయమని టీడీపీకి చెందిన ఒక కీలక ప్రజాప్రతినిధి అభిప్రాయం వ్యక్తం చేశారు. బుధవారం సీఎం సమక్షంలో జరిగే సమావేశంలోనూ ఇదే నిర్ణయం వెలువడే అవకాశం ఉందని ఆయనన్నారు. అలాగైతే ఐదో వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత, 17వ వార్డు కార్పొరేటర్ గొలగాని మంగవేణి మధ్య పోటీ నెలకొంటుంది కాబట్టి విద్యావంతురాలైన మొల్లి హేమలత వైపు సీఎం మొగ్గుచూపే అవకాశం ఉంటుంది. ఒకవేళ డిప్యూటీ మేయర్‌గా యాదవ మహిళను ఎంపిక చేస్తే టీడీపీ ఫ్లోర్ లీడర్‌గా గంధం శ్రీనివాసరావుకు అవకాశం ఇవ్వడం ఖాయమని చెప్పుకోవచ్చు. మరోవైపు డిప్యూటీ మేయర్ పదవిని తమకు కేటాయించాలని జనసేన ఫ్లోర్ లీడర్ భీశెట్టి వసంతలక్ష్మి పట్టుబడుతున్నప్పటికీ ఆమె సామాజిక వర్గానికే చెందిన వ్యక్తి పీలా శ్రీనివాసరావు మేయర్‌గా ఉండడం ఆమెకు అడ్డంకిగా మారింది. ఆ పార్టీలో మరొకరికి ఇవ్వాలనుకుంటే 22వ వార్డు కార్పొరేటర్ మూర్తియాదవ్, 64వ వార్డు కార్పొరేటర్ దల్లి గోవిందరెడ్డికి అవకాశం ఇవ్వాలి. కానీ మూర్తియాదవ్ తాను ఎలాంటి పదవి తీసుకోనని స్పష్టం చేయగా, దల్లి గోవిందరెడ్డికి సామాజిక వర్గాల సమీకరణలు అడ్డుగా నిలిచాయి. వైసీపీ నుంచి ఆ పార్టీలో చేరిన వారికి ఇవ్వాలనుకున్నాసరే డిప్యూటీ మేయర్‌గా పోటీ చేసినపుడు బీ-ఫారం జారీలో సాంకేతిక ఇబ్బందులు వస్తాయి కాబట్టి ఇతరులకు అవకాశం లేదని కూటమి ప్రజాప్రతినిధులు చెబుతున్నారు. ఏదిఏమైనా కొత్త డిప్యూటీ మేయర్ ఎవరనేది అమరావతిలో బుధవారం సీఎం చంద్రబాబు సమక్షంలో మేయర్‌తోపాటు ఎమ్మెల్యేలతో జరిగే సమావేశంలో తేలుతోంది.

## జీవితం - వి"చిత్రం"




## ఈ రోజు పంచాంగం వేళలు

తేదీ : 14 మే 2025,

తిథి : బహుళ విధియ (15తా తె.02:34వ.కు),

నక్షత్రం : అనూరాధ (ఉ.11:49వ.కు)

బ్రహ్మ ముహూర్తం : తె.04:04ల తె.04:52

రాహుకాలం : మ.12:04ల మ.01:40,

యమగండం : ఉ.07:16ల ఉ.08:52,

వర్జ్యకాలం : సా.06:00ల రా.07:58

## ఈ రోజు నమాజ్ వేళలు

తేదీ : 14 మే 2025,

ఫజర్ : తెల్లవారుజామున గం. 04:35

సూర్యోదయం : ఉదయం గం. 05:52

జొహర్ : మధ్యాహ్నం గం. 12:16

అసర్ : సాయంత్రం గం. 03:33

మఘ్రిబ్ : సాయంత్రం గం. 06:41

ఇష : రాత్రి గం. 07:58




జన స్వరం

విలేకరులు కావలెను

"జనస్వరం" ఈ-దినపత్రిక (వెబ్ పత్రిక) నందు పని చేయుటకు రెండు తెలుగు రాష్ట్రాల్లో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి విలేకరులు కావలెను..

అసక్తి ఉన్న వారు సంప్రదించండి..

సాయి కల్యాణ్

ఫోన్ నెం : 7013030690

మేనేజింగ్ డైరెక్టర్, జనస్వరం మీడియా

# నైరుతి రుతుపవనాలొచ్చేశాయ్ !

### వాతావరణశాఖ చల్లటి కబురు.. !

వేసవిలో ఎండలతో ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలకు భారత వాతావరణ విభాగం ఇవాళ చల్లని కబురు చెప్పింది. బంగాళాఖాతంతో పాటు అండమాన్ సముద్రంలోని కొన్ని ప్రాంతాలలో నైరుతి రుతుపవనాల రాక ప్రారంభమైనట్లు ఇవాళ అధికారికంగా ప్రకటించింది. ఈ రుతుపవనాలు క్రమంగా దేశవ్యాప్తంగా విస్తరించబోతున్నట్లు తెలిపింది. దీంతో మరో వారం, రెండు వారాల్లో దేశవ్యాప్తంగా వర్షాలు కురవబోతున్నాయి. మే 13న నైరుతి రుతుపవనాలు దక్షిణ బంగాళాఖాతం, దక్షిణ అండమాన్ సముద్రం, నికోబార్ దీవులు, ఉత్తర అండమాన్ సముద్రంలోని కొన్ని ప్రాంతాలలోకి విస్తరించినట్లు భారత వాతావరణ విభాగం ఇవాళ ప్రకటించింది. వచ్చే మూడు, నాలుగు రోజుల్లో దక్షిణ అరేబియా సముద్రంలోని కొన్ని ప్రాంతాలు, మాల్దీవులు, కొమోరిన్ ప్రాంతాలు, దక్షిణ బంగాళాఖాతంలోని మరికొన్ని ప్రాంతాలు, మొత్తం అండమాన్-నికోబార్ దీవులు, అండమాన్ సముద్రంలోని మిగిలిన ప్రాంతాలు, మధ్య బంగాళాఖాతంలోని కొన్ని ప్రాంతాలలో నైరుతి రుతుపవనాలు ముందుకు సాగడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నట్లు వెల్లడించింది. ఈ ఏడాది రుతుపవన వర్షపాతం సాధారణం కంటే ఎక్కువగా ఉంటుందని మరో కీలక విషయాన్ని కూడా భారత వాతావరణ విభాగం వెల్లడించింది. సాధారణంగా దేశంలో వర్షపాత దీర్ఘకాలిక సగటు 880 మి.మీ. ఉండగా.. ఈసారి ఇది 105 శాతం ఉంటుందని అంచనా వేస్తోంది. దీని ప్రభావంతో ఉత్తర భారతదేశంలో సాధారణం కంటే ఎక్కువ కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవడం, దిగువ వాతావరణ స్థాయిలలో పశ్చిమ



గాలుల ప్రభావం, ఎగువ వాతావరణ స్థాయిలలో తూర్పు గాలుల ప్రభావం దక్షిణ ద్వీపకల్పంలో దాదాపు 40 రోజుల పాటు ఉరుములతో కూడిన

## ఎడిటోరియల్

ముందస్తు వర్షపాతం ఉంటాయని తెలిపింది. అలాగే వాయువ్య పసిఫిక్ మహాసముద్రంపై సాధారణం కంటే ఎక్కువ పీడనం ఉండటం వంటి అంశాలు రుతుపవనాల రాకను సూచించే ముఖ్య కారకాలు అని ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మోహపాత్ర ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌కు తెలిపారు. ప్రస్తుతం దేశంలో వాతావరణ పరిస్థితులు ముందస్తు రుతుపవనాల రాకకు అనుకూలంగా ఉన్నట్లు వాతావరణ విభాగం ఛీఫ్ తెలిపారు. వీటి ప్రభావంతో కేరళలో రుతుపవనాల ప్రారంభం ఖాయమని ఆయన తెలిపారు. ప్రస్తుత గాలి పరిస్థితులు చూస్తుంటే రుతుపవనాలు బలపడే అవకాశాలు కనిపిస్తున్నాయన్నారు. భారత వాతావరణ నమూనా, అనేక ఇతర ప్రపంచ వాతావరణ నమూనాలు రెండూ ఈ విషయంలో ఏకాభిప్రాయంలో ఉన్నాయన్నారు. ఈ లెక్కన చూస్తే జూన్ 1 కి ముందే కేరళలో వర్షాల రాక ఖాయంగా తెలుస్తోంది.



జమ్ము సాయి కల్యాణ్,
పొలిటికల్ అనలిస్టు,
మేనేజింగ్ డైరెక్టర్,
జనస్వరం మీడియా.

## నృత్య కళాకారిణి ప్రణితా రెడ్డికి ఎంపీ కేశినేని శివనాథ్ అభినందన

### గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో స్థానం సాధించిన ఘనత



**విజయవాడ, మే 13 (జనస్వరం) :** కూచిపూడి నృత్య కళను ప్రపంచానికి చాటిచెప్పిన ఘనత యువ నర్తకి ప్రణితా రెడ్డి (14) సొంతమైంది. ఇటీవల హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన "కళా వైభవం" కార్యక్రమంలో 4,300 మంది నృత్య కళాకారులతో కలిసి ప్రణితా రెడ్డి ప్రదర్శన ఇచ్చింది. ఈ అద్భుత ప్రదర్శన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో స్థానం దక్కించుకోవడంతో, ఆమెకు శుభాకాంక్షలు తెలిపేందుకు ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) స్వయంగా అభినందనలు తెలిపారు. పశ్చిమ నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు ఆర్.మాధవ్ ఆధ్వర్యంలో మంగళవారం ఎంపీ శివనాథ్ గురునానక్ కాలనీలో ఎన్టీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రణితా రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమె గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ నుంచి అందుకున్న మెడల్, ప్రశంసాపత్రాన్ని ఎంపీ శివనాథ్‌కి చూపించారు. ఈ సందర్భంగా ప్రణితా రెడ్డి నృత్యం పట్ల చూపిన మక్కువను కొనియాడిన ఎంపీ శివనాథ్, తల్లిదండ్రులు దాసరి శివాజీ రెడ్డి, నాగమణిలను ప్రత్యేకంగా అభినందించారు. కేవలం 14 ఏళ్ల వయసులోనే 1000కి పైగా ప్రదర్శనలు ఇవ్వడం విశేషమేనన్నారు. ఈ ఘనతను దేశానికి గర్వకారణంగా పేర్కొంటూ, ప్రణితా రెడ్డి భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో మెరిపించాలంటూ తన ఆశీస్సులు తెలిపారు.

## అబుదాబిలోని బీఈపీఎస్ హిందూ మందిరంలో ఘనంగా వాసవి అమ్మవారి జయంతి ఉత్సవాలు



**అబుదాబి, మే 13 (జనస్వరం) :** వరల్డ్ ఆర్యవైశ్య మహాసభ (డబ్ల్యూఏఎం) ఆధ్వర్యంలో అబుదాబిలోని బీఈపీఎస్ హిందూ దేవాలయంలో వాసవి మాత జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ఆర్యవైశ్య సమాజానికి, వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని" తెలిపారు. ఆయన మాట్లాడుతూ, వాసవి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీఎం చంద్రబాబు స్వయంగా పట్టు వస్త్రాలు సమర్పించిన విషయం కూడా ఆయన తెలియజేశారు.

**ప్రభుత్వ ప్రాధాన్యత : ఏపీ ఎన్ఆర్టీకి సమర్థన**

రాకేష్ రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ఎన్నారైలు (ఎన్ఆర్టీ) కి ఇచ్చే ప్రాధాన్యత గురించి కూడా వివరించారు. ఈ కార్యక్రమం వామ్ అబుదాబి అధ్యక్షుడు రాజేష్ బైసాని ఆధ్వర్యంలో నిర్వహించారు.


**తెలుగు ప్రజల హాజరుకి ప్రత్యేక స్థానం :**

ఈ కార్యక్రమంలో యూఏఈలోని పలు ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో తెలుగు ప్రజలు పాల్గొన్నారు.

**ఉత్సవం : సంస్కృతి, ఆధ్యాత్మికత, ఐక్యత**

వాసవి అమ్మవారి జయంతి ఉత్సవం అబుదాబిలో తెలుగు సాంస్కృతిక మరియు ఆధ్యాత్మిక విలువలకు ప్రతిబింబంగా నిలిచింది.

## పెంచిన కరెంటు చార్జీలను తగ్గించాలి



**పులివెందుల, మే 13 (జనస్వరం) :** పెంచిన కరెంటు చార్జీలను తగ్గించాలని కాంగ్రెస్ పార్టీ పులివెందుల అసెంబ్లీ సమన్వయకర్త ధ్రువ కుమార్ రెడ్డి కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెల అధికంగా కరెంటు బిల్లులను వేసి ప్రభుత్వం ప్రజల నుండి వసూలు చేస్తున్నదని చెప్పారు. రకరకాల పేర్లతో కరెంటు బిల్లుల్లో ఫీజులను వసూలు చేయడం దుర్మగమన్నారు. ఎన్నికలకు ముందు విద్యుత్తు చార్జీలు పెంచమని చెప్పి అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యుత్ చార్జీలను పెంచడం జరిగిందని చెప్పారు. విద్యుత్ చార్జీలను చూస్తేనే ప్రజలకు షాక్ కొట్టుతున్నదని చెప్పారు. రకరకాల పేర్లతో వేస్తున్న విద్యుత్తు చార్జీలను తొలగించి ప్రజలకు ఆర్థిక భారం లేకుండా చూడాలన్నారు. ప్రజలపై ఎక్కువగా కరెంటు భారం పడుతున్నదని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

## ఉద్యానవన సాగుతోనే రైతుకు అత్యధిక ఆదాయం

- ఐదేళ్లలో సాగు రెట్టింపయ్యేలా ప్రణాళికల అమలు
- 11 ప్రాధాన్య పంటలు - 24 క్లస్టర్లుగా అభివృద్ధి
- త్వరలో డ్రిప్ ఇరిగేషన్‌కు ఆటోమెషిన్ పరికరాల ఏర్పాటు
- పండ్లతోటల రైతులకు సబ్సిడీపై ఫ్రూట్ కవర్ల పంపిణీ
- హార్టికల్చర్ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

**అమరావతి, మే 13 (జనస్వరం) :** గోదావరి, కృష్ణా డెల్టా మినహా రాష్ట్రంలో మిగిలిన అన్ని ప్రాంతాల్లోనూ హార్టికల్చర్ సాగును విస్తృతంగా ప్రోత్సహించాలని... రైతుకు ఎకరాకు ఏడాదికి కనీసం లక్ష రూపాయలు ఆదాయం ఆర్జించడమే లక్ష్యం కావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులతో అన్నారు. మంగళవారం సచివాలయంలో హార్టికల్చర్‌పై సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు. మిరప, అరటి, మామిడి, ఆయిల్ పామ్, కోకో, డ్రాగన్ ఫ్రూట్, జీడిమామిడి, కాఫీ, కొబ్బరి, టొమాటో, ఉల్లి.. ఈ 11 ప్రాధాన్య పంటలతో రాష్ట్రంలో 24 క్లస్టర్లు ఏర్పాటు చేసి రైతులకు తోడ్పాటు అందించాలని చెప్పారు.

**లక్ష ఎకరాల్లో కోకో సాగుకు చర్యలు :**

'ప్రస్తుతం రాష్ట్రంలో 18.23 లక్షల హెక్టార్లలో ఉన్న ఉద్యానవన సాగును, వచ్చే ఐదేళ్లలో రెట్టింపు చేయాలి. ఆయిల్ పామ్, కోకో, కొబ్బరి పంటల డిమాండ్ దృష్ట్యా రైతులకు ఈ పంటల సాగు విషయంలో అవగాహన కల్పించాలి. ప్రపంచంలో కోకో సాగులో 1 శాతం కన్నా తక్కువగా మన దేశంలో సాగు అవుతోంది. ప్రపంచ మార్కెట్‌లో ఉన్న డిమాండ్‌ను అందిపుచ్చుకునేలా లక్ష ఎకరాల్లో కోకో సాగు చేసేలా చూడాలి. కోకో పంట కోసిన తర్వాత నాణ్యత విషయంలో రైతులు జాగ్రత్తలు తీసుకునేలా శిక్షణ ఇవ్వాలి. అలాగే వీటికి అనుబంధంగా చిన్నతరహాలో ప్రాసెసింగ్ యూనిట్లు రైతులే నెలకొల్పేలా చేస్తే మరింత ఆదాయానికి అవకాశం ఉంటుంది. రైతులు పండించే పంటలకు అధిక విలువ తీసుకురావడంపై దృష్టి పెట్టాలి.' అని సీఎం అన్నారు.

**మైక్రో ఇరిగేషన్‌కు అత్యధిక ప్రాధాన్యత :**

'మైక్రో ఇరిగేషన్‌కు కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న సబ్సిడీని రాష్ట్రంలో రైతులు వినియోగించుకునేలా చూడాలి. ఎస్సీ, ఎస్టీ, చిన్న రైతులకు డ్రిప్ ఇరిగేషన్‌లో ప్రాధాన్యత ఇవ్వాలి. అలాగే ఇప్పటికే రైతులు ఏర్పాటు చేసుకున్న డ్రిప్ ఇరిగేషన్‌కు ఆటోమెషిన్ పరికరాలు అమర్చాలి. దీని ద్వారా నీరు, ఎరువులు ఆదా అవుతాయనే విషయం రైతులకు తెలియజేయాలి.' అని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు.

**ఫ్రూట్ కవర్ల పంపిణీతో ఉత్తమ ఫలితాలు :**

మరోవైపు ఉద్యానవనరంగానికి ఉన్న అవకాశాలను వివరిస్తూ ప్రతి నెలా అన్ని జిల్లాల్లో కాంక్లేవ్‌లు నిర్వహిస్తున్నట్టు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. అలాగే 10 వేల హెక్టార్లలో పండ్ల సాగు చేస్తున్న రైతులకు రూ.32 కోట్ల వ్యయంతో ఫ్రూట్ కవర్లు సబ్సిడీపై అందించామని, దీంతో రైతులకు రూ.120 కోట్లు అదనంగా ఆదాయం వచ్చిందని వివరించారు. ఈ సమీక్షలో మంత్రి అచ్చెన్నాయుడు, అగ్రికల్చర్ మిషన్ కార్పొరేషన్ చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

## అమర సైనికులకు ముస్లిం జనసైన్యం నివాళులు

### "జోహార్ నమాజ్" అనంతరం ప్రత్యేక ప్రార్థన






**నకరికల్లు, మే 13 (జనస్వరం) :** మండలంలో జనసేన పార్టీకి చెందిన ముస్లింలు దేశ భక్తిని చాటుతూ ఓ విశిష్ట కార్యక్రమం నిర్వహించారు. మంగళగిరిలోని "ఆర్ఆర్ఆర్ కన్వెన్షన్" హాల్‌లో మంగళవారం జోహార్ నమాజ్ అనంతరం దేశ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన అమర సైనికులకు, యుద్ధంలో వీరమరణం పొందిన జవాన్లకు, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగజే యాలనే ఉద్దేశంతో ప్రత్యేక ప్రార్థన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నకరికల్లు మం డల వైస్ ప్రెసిడెంట్ సయ్యద్ నాగూర్ వలి మాట్లాడుతూ "మన దేశ సైన్యం కోసం మేము ముస్లిం మైనారిటీలు కూడా? తలపోకుండా అండగా నిలుస్తాము. మన జవాన్లు యుద్ధంలో ఘన విజయాలు సాధించాలని, దేశ సరిహద్దులను కాపాడే సైనికులెప్పుడూ బలంగా ఉండాలని మేము ప్రార్థిస్తున్నాం. అమర సైనికుల త్యాగాలను మరువకూడదు. వారి కుటుంబాలకు మానసికంగా, సమాజం నుండి అండగా ఉండే విధంగా మనమంతా కట్టుబడి ఉండాలి," అని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి నాయకులు షేక్ రియాజు, షేక్ నాయబ్ కమల్, సయ్యద్ జిలాని, షేక్ ఇస్మాయిల్ బేక్, చర్లపల్లి శ్రీనివాసరావు, జిల్లా నాయకులు అడపాల మాణిక్యరావు, సాధిక్, సుభాని, ఖాసిం, మధులాల్, సలీం, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు. అంతేకాక రాష్ట్ర హజ్ కమిటీ సభ్యులు, రాష్ట్ర ఒక బోర్డ్ కమిటీ నాయకులు, మండల నాయకులు, గ్రామ నాయకులు, స్థానిక జనసైనికులు ఈ కార్యక్రమానికి హాజరై, దేశ భక్తిని చాటారు. ఈ వేళ, జనసేన ముస్లిం శ్రేణుల చొరవతో జరిగిన ఈ ప్రార్థన కార్యక్రమం, సమాజంలో మతసామరస్యానికి, దేశభక్తికి ప్రతిరూపంగా నిలిచింది.

## బెజవాడ కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు

### దేశ సైన్యానికి దైవబలం కలగాలని జనసేన ప్రార్థన



**విజయవాడ, మే 13 (జనస్వరం) :** జనసేన పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం కొణిదల పవన్ కళ్యాణ్ సూచనల మేరకు, దేశ రక్షణలో నిబద్ధతతో ఉన్న భారత సైన్యానికి దైవబలం కలగాలని ఆకాంక్షిస్తూ ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ వారిని జనసేన పార్టీ నాయకులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, శాసనమండలి విప్ పిడుగు హరిప్రసాద్, ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను హాజరై దుర్గమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. దేశానికి సేవ చేస్తున్న సైనికులకు ఆ భగవతీ తల్లిదీవెనలుండాలని, సరిహద్దుల్లో విజయం సాధించాలని, దేశ రక్షణలో అమరులైన సైనికుల ఆత్మలకు శాంతి కలగాలని ఈ సందర్భంగా వారు ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనడం విశేషం. భక్తిశ్రద్ధలతో జరిగిన ఈ పూజా కార్యక్రమం దేశభక్తి, మతసామరస్యానికి అద్దంపడే విధంగా నిలిచింది.

## పటమట ఎన్టీఆర్ సర్కిల్ ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన


- ప్రజా సంక్షేమానికి ఆద్యుడు ఎన్టీఆర్
- ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామమోహన్



**విజయవాడ, మే 13 (జనస్వరం) :** తెలుగు ప్రజల ఆరాధ్య దైవం, ప్రజా సంక్షేమ పథకాల పితామహుడు నందమూరి తారక రామారావు అని విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం తూర్పు నియోజకవర్గ పరిధిలోని పటమట ఎన్టీఆర్ సర్కిల్ ఆధునికీకరణ పనులకు రూ.20 లక్షల వ్యయంతో శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామమోహన్ పాల్గొని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ "నందమూరి తారకరామారావు తెలుగు ప్రజల గర్వకారణం. ఆయన సినీ రంగానికే కాదు, రాజకీయ రంగానికీ ఒక మహోన్నత శిఖరం. తెలుగుదేశం పార్టీని స్థాపించి కేవలం 9 నెలల్లో అధికారంలోకి తీసుకొచ్చారు. అప్పటి ప్రధాని ఇందిరా గాంధీని కూడా ఆయన రాజకీయంగా సవాల్ చేశారు. ఎన్టీఆర్ విగ్రహం చూస్తే ప్రతి ఒక్కరికి స్ఫూర్తి కలుగుతుంది. 20 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ సర్కిల్‌ను ఇప్పుడు మరింత ఆధునికంగా తీర్చిదిద్దేందుకు ఎంపీగా నన్ను ఎంపికచేసి ప్రారంభించడమే గాక, విజయవాడకు ఒక మైలురాయిగా మార్చే లక్ష్యంతో పనులు ప్రారంభిస్తున్నాం" అని అన్నారు. ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ "ఎన్టీఆర్ పేరు చెప్పగానే ప్రజలలో ఎనలేని గౌరవం, అభిమానం వ్యక్తమవుతుంది. ఆయన ప్రారంభించిన రెండు రూపాయల కిలో బియ్యం, పక్కా గృహాలు, పింఛన్ పథకాలు ఇవాల్టి దేశ పథకాలుగా మారాయి. అలాంటి మహానుభావుడి విగ్రహాన్ని గల ఎన్టీఆర్ సర్కిల్ ఆధునికీకరణ పనులను ప్రారంభించడంలో నేను భాగస్వామ్యమవడాన్ని అదృష్టంగా భావిస్తున్నా. ఇది విజయవాడ నగరానికి ఒక గర్వకారణం అవుతుంది" అని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నర్రా కిషోర్, చెన్నుపాటి గాంధీ, షేక్ ఫిరోజ్, కార్పొరేటర్లు ముమ్మినేని ప్రసాద్, జాస్తి సాంబశివరావు, దేవినేని అపర్ణ, చెన్నుపాటి ఉషారాణి, పొట్లూరు సాయిబాబా, పేరిపి ఈశ్వర్, అడపా నాగేంద్ర, సోంగా సంజయ్ వర్మ, శివలక్ష్మి, శిరీష గాంధీ, సూర్య కుమారి తదితరులు పాల్గొన్నారు.

## వీర సైనికుల ప్రాణత్యాగాలు చిరస్మరణీయం

### మాజీ సీఎం వైఎస్ జగన్



**పులివెందుల, మే 13 (జనస్వరం) :** భారతదేశం కోసం వీరసైనికులు చేసిన త్యాగాలు చిరస్మరణీయమని మాజీ సీఎం వైఎస్ జగన్ స్పష్టం చేశారు. సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం తల్లి తండాలో ఇటీవల వీరమరణం పొందిన మురళి నాయక్ కుటుంబాన్ని మంగళవారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ దేశ రక్షణ కోసం మురళి నాయక్ అమరుడయ్యారన్నారు. ఆయన ప్రాణాన్ని తీసుకురాలేకపోయినా కుటుంబానికి మాత్రం వైసిపి అండగా ఉంటుందని తెలిపారు. సైనికులు వీరమరణం చెందితే ప్రభుత్వం తరఫున రూ.50 లక్షలు చెల్లించే సంప్రదాయాన్ని వైసీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఇదే సంప్రదాయాన్ని ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా ఆచరించడం శుభపరిణామని అందుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. తాను కూడా మురళి నాయక్ కుటుంబానికి తన వంతు సహాయంగారూ. 25 లక్షలు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు చెప్పారు.

# సుదీర్ఘ సముద్ర తీరం ద్వారా రాష్ట్రంలో పోర్ట్ ఆధారిత ఎకానమీ

- ప్రతి 50 కి.మీ ఒక పోర్ట్ లేదా ఫిషింగ్ హార్బర్ ఏర్పాటు లక్ష్యం
- కేంద్ర సాయంతో దుగరాజపట్నంలో రూ.3,500 కోట్లతో నౌకా నిర్మాణ కేంద్రం
- కేంద్ర ప్రభుత్వ పోర్టులు, షిప్పింగ్, వాటర్ వేస్ శాఖ అధికారులతో సమీక్షలో సీఎం చంద్రబాబు

**అమరావతి, మే 13 (జనస్వరం) :** సుదీర్ఘ సముద్ర తీరం ద్వారా రాష్ట్రంలో పోర్ట్ ఆధారిత ఎకానమీని సాధించేందుకు ప్రణాళికతో పనిచేస్తున్నామని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్రంలో 1000 కి.మీ పైగా ఉన్న సముద్ర తీరాన్ని పూర్తి స్థాయిలో ఉపయోగించుకుని మారిటైం ప్రాజెక్టులు నెలకొల్పుతామని సీఎం అన్నారు. రాష్ట్రంలో తీర ప్రాంతాల్లో చేపట్టే ప్రాజెక్టులు, పోర్టులపై సిఎం సచివాలయంలో సమీక్ష చేశారు. కేంద్ర ప్రభుత్వ పోర్ట్స్, షిప్పింగ్, వాటర్ వేస్ శాఖ సెక్రటరీ టి.కె. రామచంద్రన్ తో పాటు పలువురు కేంద్ర రాష్ట్ర అధికారులతో సీఎం రివ్యూ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న పోర్టులు, కొత్తగా నిర్మాణం అవుతున్న పోర్టుల స్థితిగతుల పై చర్చించారు. తీర ప్రాంతంలో ప్రతి 50 కి.మీ ఒక పోర్ట్ లేదా ఒక ఫిషింగ్ హార్బర్ నిర్మించాలనే ఆలోచనతో తాము ఉన్నామని సీఎం చంద్రబాబు కేంద్ర ప్రభుత్వ అధికారులకు తెలిపారు. రాష్ట్ర విభజన సమయంలో నెల్లూరు జిల్లా దుగరాజపట్నంలో పోర్ట్, ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు నాడు కేంద్రం అంగీకరించింది. కొత్త జిల్లా ఏర్పాటుతో తిరుపతి జిల్లా పరిధిలోకి వచ్చిన దుగరాజపట్నంలో షిప్ బిల్డింగ్ అండ్ రిపేర్ క్లస్టర్ ఏర్పాటు అంశంపై వారితో చర్చించారు. ఇనిషియల్ ఫీజిబులిటీ రిపోర్ట్ ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో 2 వేల ఎకరాల్లో షిప్ బిల్డింగ్ సెంటర్ ఏర్పాటుకు నిర్ణయించారు. దుగరాజపట్నంలో నౌకా నిర్మాణం, మరమ్మతుల క్లస్టర్, గ్రీన్‌ఫీల్డ్ పోర్ట్‌తో కలిపి అభివృద్ధి చేస్తారు. 4 డ్రై డాక్‌లు, అవుట్ ఫిటింగ్ జెట్టీలు, షిప్ లిఫ్ట్ సౌకర్యం కలిగిన నౌకా నిర్మాణ కేంద్రం ఇక్కడ వస్తుంది. షిప్ బిల్డింగ్ పరిశ్రమకు 1000 ఎకరాలు, అనుబంధ పరిశ్రమలకు మరో 1000 ఎకరాలు భూమి అవసరం ఉంటుంది. ఈ ప్రాజెక్టు చేపట్ట డానికి కేంద్రం దాదాపు రూ.3,500 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ చేపడుతుంది. భూసేకరణతో పాటు పరిశ్రమకు అనువైన ప్రాంతంగా దీన్ని తీర్చిదిద్దుతారు. తరువాత స్పెషల్ పర్పస్ వెహికిల్ (ఎస్‌పీవీ) ఏర్పాటు చేసి ప్రపంచ స్థాయి సంస్థలను ఆహ్వానించి ఇక్కడ షిప్ బిల్డింగ్ పరిశ్రమను ఏర్పాటు చేస్తారు. నౌకా నిర్మాణ కేంద్రం ద్వారా దాదాపు రూ.26 వేల కోట్ల పెట్టుబడులు వస్తాయి. ప్రత్యక్షంగా 5 వేల మందికి, పరోక్షంగా 30 వేల మందికి ఈ ప్రాజెక్టు ద్వారా లబ్ధి చేకూరుతుంది. ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకువెళ్లేందుకు అధికారులకు సీఎం పలు సూచనలు చేశారు. దీనికి అవసరమైన కార్యాచరణ వెంటనే సిద్ధం చేయాలని సిఎం అధికారులను ఆదేశించారు. రాష్ట్రానికి తలమానికంగా ఉన్న విశాఖ పోర్టులో మరింత చౌకగా సరుకు రవాణాకు అవకాశం కల్పించాలని సిఎం కేంద్ర అధికారులను కోరారు. అదే విధంగా రాష్ట్రంలో క్రూయిజ్ టూరిజం ప్రాజెక్టులకు ఉన్న అవకాశాలను కూడా ఈ సమావేశంలో అధికారులు వివరించారు. పోలవరం, శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాంతాల్లో రివర్ క్రూయిజ్ సర్క్యూట్స్ ను అభివృద్ధి చేసే అంశంపై అధ్యయనం చేయాలని అధికారులకు సిఎం సూచించారు. సమీక్షలో మంత్రి బి.సి.జనార్ధన్ రెడ్డితో పాటు అధికారులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ ఫ్లెక్సీ చింపివేత

## సామాజిక విభేదాలకు బలైన సమాజ సంస్కర్త మూర్తి





**పెనుమంట్ర, మే 13 (జనస్వరం) :** రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ పేరు మీద ఏర్పడిన ఘనతను లకించేట్టుగా ఓ దురదృష్టకర సంఘటన మండలంలోని ఒక గ్రామంలో చోటు చేసుకుంది. జాతర సందర్భంగా ఫ్లెక్సీ చింపివేతతో పాటు, వర్గాల మధ్య వాగ్వాదం, తోపులాట, పోలీసు ఫిర్యాదుల దాకా ఈ సంఘటన దారి తీసింది.

**పాట వేసినందుకు వివాదం :**
రెండురోజులుగా గ్రామంలో జాతర జరుగుతున్న సందర్భంలో, డీజే వాహనం ఎస్సీ కాలనీ ప్రాంతం వద్దకు చేరుకుంది. ఆ కాలనీ వాసుల కోరిక మేరకు అంబేద్కర్ స్ఫూర్తిదాయకమైన పాటను పెట్టారు. అయితే, ఈ సమయంలో అక్కడే ఉన్న రెడ్డి సామాజిక వర్గానికి చెందిన కొంతమంది కమిటీ సభ్యులు అంబేద్కర్ పాటపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ, ఆయన పేరు మీద దుర్వాక్యాలు ఉపయోగించారు. దీనితో ఆ ప్రాంతంలోని ఎస్.సి. వాసులు తీవ్రంగా స్పందించి వారితో వాగ్వాదానికి దిగారు.

**తోపులాట – ఆగ్రహాన్ని చాటుకున్న వర్గం :**
వాగ్వాదం క్రమంగా తోపులాటకు దారి తీసింది. పోలీసులు చేరుకునేలోపు రెండు వర్గాలు తమ ఆగ్రహాన్ని వ్యక్తపరిచాయి. అయితే ఈ సంఘటనతో అక్కడే ఆగకుండా, అంబేద్కర్ అభిమానుల మనసును కలచివేసే మరో దారుణం జరిగింది.

**అంబేద్కర్ ఫ్లెక్సీ చింపివేత :**
రాత్రి సమయంలోనే సదరు కమిటీ సభ్యులు గ్రామ సెంటర్లో ఏర్పాటుచేసిన అంబేద్కర్ ఫ్లెక్సీని చింపి, కాలువలో పడేశారు. ఉదయం ఇది గమనించిన ఎస్సీ వాసులు తీవ్ర ఆగ్రహంతో స్పందించి, ఫ్లెక్సీ చింపిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ పెనుమంట్ర పోలీస్ స్టేషన్‌కి పెద్ద సంఖ్యలో ర్యాలీగా వెళ్లి ఫిర్యాదు చేశారు.

**పోలీసుల శాంతి చర్చలు – తిరిగి ఫ్లెక్సీ ఏర్పాటు :**
స్థానిక ఎస్.ఐ. స్పందిస్తూ, సంఘటనను తీవ్రంగా పరిగణించి, ఫ్లెక్సీ చింపిన వారికే మళ్లీ అదే ఫ్లెక్సీని పెట్టించాలని ఆదేశించారు. సాంత్వన చర్చల ద్వారా పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. శాంతిభద్రతల దృష్ట్యా ఆ ప్రాంతంలో పోలీసులు పహారా కాస్తున్నారు. ప్రస్తుతం అంబేద్కర్ ఫ్లెక్సీ తిరిగి అదే చోట పెట్టడం జరిగిందని పోలీసులు తెలిపారు.

**సామాజిక సంఘాల స్పందన :**
ఈ ఘటనపై దళిత సంఘాలు, సామాజిక న్యాయ కార్యకర్తలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. “రాజ్యాంగ నిర్మాత, మానవ హక్కుల పోరాట యోధుడిపై ఈ విధమైన అవమానకర చర్యలను ఎంతగా ఖండించినా తక్కువే. ఇది కేవలం ఫ్లెక్సీ చింపివేత కాదని, దళిత గౌరవంపై దాడిగా చూడాలి,” అని స్థానిక దళిత నాయకులు పేర్కొన్నారు.

**కేసు నమోదు, దర్యాప్తు ప్రారంభం :**
ఫ్లెక్సీ చింపివేతకు సంబంధించి పోలీసులు కేసు నమోదు చేసినట్టు సమాచారం. ఈ చర్యలు చట్టబద్ధంగా తప్పని, శాంతిభద్రతలను కాపాడటంలో ఎలాంటి లోపం ఉండకూడదని స్థానికులు అంటున్నారు. ఈ సంఘటన ఒక్క గ్రామానికి మాత్రమే పరిమితం కాకుండా, సామాజిక హక్కులు, గౌరవం, స్వేచ్ఛపై సమాజంలో ఏ స్థాయిలో అపహాస్యం, ఆధిపత్య భావన కొనసాగుతుందో చాటుతోంది. ఇటువంటి ఘటనలను నియమిత విధానాలతో ఎదుర్కోవడం మాత్రమే కాదు, సామాజిక అవగాహన, సహబావాన్ని పెంపొందించాల్సిన అవసరం మనమందరిమీదా ఉంది.

# “జయహెూ భారత్” సిందూర్ అమరవీరులకు క్రైస్తవ ప్రార్థనలతో జనసేన నివాళి





**గుంటూరు, మే 13 (జనస్వరం) :** ఉగ్రవాదంపై ‘ఆపరేషన్ సిందూర్’లో ప్రాణాలు అర్పించిన భారత జవానుల త్యాగాలకు క్రైస్తవ ప్రార్థనల ద్వారా ఘన నివాళులు అర్పిస్తూ జనసేన పార్టీ నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమం “జయహెూ భారత్” రాష్ట్రవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటోంది. గుంటూరులోని ఏసీ కళాశాల సెమినార్ హాల్‌లో నిన్న సాయంత్రం జరిగిన ఈ కార్యక్రమానికి జనసేన పార్టీ ఆధ్వర్యం వహించగా, ఏపీ మాల కార్పొరేషన్ చైర్మన్ డా. పెదపూడి విజయ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జవానుల త్యాగాలను స్మరించుకుంటూ పలువురు సువార్తికులు ప్రార్థనలు నిర్వహించారు.

**జవానుల త్యాగం – దేశ భద్రతకు పునాది :**
“ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంలో జవానుల పాత్ర అమోఘం. వారి సేవలను గుర్తు చేసుకుంటూ, దేశం పట్ల వారి అవిరళ నిబద్ధతను నేటి తరం కూడా అనుసరించాలి,” అని డా.విజయ్ కుమార్ అన్నారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత జవానులు చూపిన ధైర్య సాహసం దేశ గర్వకారణంగా నిలుస్తుందన్నారు. ప్రధానమంత్రి మోదీ నేతృత్వంలోని పోరాట స్ఫూర్తికి తోడుగా, ఉప ముఖ్యమంత్రి దేశవ్యాప్తంగా ప్రార్థనా మందిరాలలో జవానుల స్థైర్యాన్ని పెంపొందించేందుకు పిలుపు ఇవ్వడాన్ని ఆయన ప్రశంసించారు.

**ఆధ్యాత్మిక ప్రేరణతో దేశ భక్తి :**
ఈ కార్యక్రమంలో పాస్టర్ పాల్ ఇమ్మాన్యుయల్ ఆరంభ ప్రార్థనలో మాట్లాడుతూ, జవానుల ఆధ్యాత్మిక శక్తి, త్యాగధర్మాన్ని ప్రస్తావించారు. “వారి జీవితాలు మనకు సత్యం, ప్రేమ, సమర్పణ భావనలను నేర్పిస్తాయి,” అని అన్నారు. రెవ. సునీల్ తన శుభాకాంక్షల సందేశంలో, “జవానుల త్యాగాలను గుర్తు చేస్తూ సమాజంలో ఐక్యత, సామరస్యం పెంపొందించాల్సిన అవసరం ఉంది,” అని తెలిపారు.

**పార్టీ నేతల భావోద్వేగం :**
జనసేన రాష్ట్ర కార్యదర్శి బేతపూడి విజయ్ శేఖర్, టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ గౌతమ్ రాజు, డా. కే. మనోహర్, పత్తిపాడు ఇంచార్జ్ కొర్రపాటి నాగేశ్వరరావు వంటి నాయకులు పాల్గొనగా, జనసేన నేత గాదె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, “జవానుల త్యాగ నిరతి అంతర్జాతీయ మద్దతు సాధించడంలో భారత్‌కు ఎంతో ఉపకరించిందని, అది యువతకు ప్రేరణగా నిలుస్తుంది,” అన్నారు.

**సాంస్కృతిక కార్యక్రమాలు – దేశభక్తి ఉద్రేకం :**
స్వాగత గీతాలు, ప్రార్థనలు, కృతజ్ఞతలు, జాతీయ గీతం కార్యక్రమాన్ని ప్రత్యేకంగా మలిచాయి. అనంతరం టీ, స్నాక్స్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం హాజరైన వందలాది మంది జనసేన కార్యకర్తలకు స్ఫూర్తినిచ్చేలా సాగింది. ఇది కేవలం ప్రార్థన కార్యక్రమం మాత్రమే కాదు – దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వారిపట్ల ప్రజల మానవతా మద్దతును, ఆధ్యాత్మిక విలువలతో కూడిన కృతజ్ఞతను ప్రతిబింబించేదిగా నిలిచింది.

# ఆర్థిక నేరాల్లో కేశినేని నాని పాత్రపై సీబీఐ విచారణకు చేయించాలి

- ఎమ్మెల్యే కొలికపూడి డిమాండ్
- వైసీపీ అజెండాకు నాని వేదిక
- అభివృద్ధిపై చర్చకు సవాల్



**విజయవాడ, మే 13 (జనస్వరం) :** గత పదేళ్లుగా ఎంపీగా సేవలందించిన కేశినేని శ్రీనివాస్ అలియాస్ కేశినేని నాని ఆర్థిక నేరాలకు పాల్పడినట్టు ఆరోపణలపైన సీబీఐ దర్యాప్తు కోరుతూ తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు కేంద్ర దర్యాప్తు సంస్థ డైరెక్టర్‌కు లేఖ రాశారు. ఎన్టీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన, నాని రాజకీయ అధికారాన్ని అడ్డుపెట్టుకొని కోట్లాది రూపాయల బ్యాంకు రుణాలు ఎగ్గొట్టినట్లు ఆరోపించారు.

**షెల్ కంపెనీలతో ఆదాయం మళ్లింపు – లక్ష్యంగా బ్యాంకు మోసాలు :**
ఎంపీగా వున్న నాని, తన హెూటల్ వ్యాపారాల ద్వారా వచ్చిన ఆదాయాన్ని బ్యాంకులకు తిరిగి చెల్లించకుండా, ‘ఆంధ్ర క్యాంటీన్’ అనే షెల్ కంపెనీ ద్వారా ఇతర ఖాతాలకు మళ్లించినట్లు కొలికపూడి వివరించారు. కేశినేని హెూటల్స్ ప్రైవేట్ లిమిటెడ్, హెూరేకా ప్రైవేట్ లిమిటెడ్ వంటి సంస్థల పేర్లతో తీసుకున్న రుణాలను ఎన్‌పీఏ మారిన తరువాత ఇతరులకు తాకట్టు పెట్టడం ద్వారా మరో ఆర్థిక నేరానికి పాల్పడ్డారన్నారు. ఇతరుల పేర్లను డైరెక్టర్లుగా చూపిస్తూ, నేరవైభవాన్ని కప్పిపుచ్చేందుకు కేశినేని కుటుంబ సభ్యులు వ్యవస్థను ఎలా ఉపయోగించుకున్నారో ఆయన వివరించారు. నాని భార్య తప్పుకుని, తాతినేని రాంబాబు, కాట్ర గడ్డ హేమంత్‌లను డైరెక్టర్లుగా నియమించి బహుళ కంపెనీల మధ్య నగదు మళ్లింపులు చేశారని మండిపడ్డారు.

**లిక్కర్ స్కామ్ నుండి దృష్టి మళ్లించేందుకే ఆరోపణలు – స్పష్టం చేసిన ఎమ్మెల్యే :**
జగన్ రెడ్డి ప్రభుత్వంలోని లిక్కర్ స్కాంపై విచారణ కొనసాగుతున్న సమయంలో దృష్టి మళ్లించేందుకు నాని ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని కొలికపూడి అన్నారు. నాని చేసిన ఆర్థిక నేరాలపై తన వద్ద పూర్తి సాక్ష్యాలున్నాయని పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా, నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని సీబీఐను కోరారు.

**అభివృద్ధి అంశంపై చర్చకు సవాల్ – నానికి ఎమ్మెల్యే ధీటుగా :**
విజయవాడ ఎంపీగా పదేళ్లుగా ఉన్న నాని నియోజకవర్గంలో అభివృద్ధిపై ఎలాంటి పనులు చేశారో చర్చకు రావాలని కొలికపూడి శ్రీనివాసరావు సవాల్ విసిరారు. గత పదకొండు నెలల కాలంలో ఎంపీగా ఉన్న కేశినేని శివనాథ్ నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలు ఉద్ఘాటించారు. తిరువూరు, జి.కొండూరు తండాల నుంచి మైలవరం, నందిగామ వరకు శివనాథ్ చేస్తున్న పర్యటనలు, యువత ఉపాధి కోసం నైపుణ్య శిక్షణ శిబిరాల ఏర్పాటు, హైదరాబాదులో నిఆర్‌ఐడి ద్వారా శిక్షణా కార్యక్రమాలు వంటి అంశాలను ప్రస్తావించారు. ఎంపీగా ఉన్న సమయంలో నాని వీఐపీలా మాత్రమే వచ్చి వెళ్లారని, నియోజకవర్గంలో అభివృద్ధికి పెద్దగా సహకరించలేదన్నారు.

**కేశినేని నానిపై బురద జల్లే కుట్ర – పార్టీ ప్రతినిధుల ఆరోపణ :**
వైసీపీ జెండాను భుజాన మోస్తూ, తాడేపల్లి స్క్రిప్ట్‌తో నాని మాట్లాడుతున్నారని మండిపడ్డ కొలికపూడి, లిక్కర్ స్కాంపై సిట్ విచారణను ప్రజల దృష్టి నుండి మళ్లించేందుకే చిన్ని పై ఆరోపణలు చేశారని వ్యాఖ్యానించారు. దీనిపై ఎంపి చిన్ని స్పందించాల్సిన అవసరం లేదని, ఎన్డీయే కూటమిలో ఉన్న ఎనిమిది మంది ఎమ్మెల్యేలు కలిసి అభివృద్ధి కోసం పనిచేస్తున్నారని స్పష్టం చేశారు.

**భవిష్యత్ లక్ష్యం – ప్రతి నియోజకవర్గానికి ఒక ఇండస్ట్రీయల్ పార్క్ :**
2025–26 బడ్జెట్ తర్వాత ప్రతి నియోజకవర్గంలో ఓ ఇండస్ట్రీయల్ పార్క్ ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో ఎన్డీయే కూటమి ముందుకు వెళ్తుందని కొలికపూడి వివరించారు. గత ప్రభుత్వం చేసిన విధ్వంసాల నష్టాన్ని పూడ్చేందుకు మొదటి ఐదు నెలలు కష్టపడాల్సి వచ్చిందని తెలిపారు.

# మాంజ్రీ గ్రామంలో శ్రామినార్స్ శిబిరం ముగింపు





**భైంసా, మే 13 (జనస్వరం) :** మాంజ్రీ గ్రామంలో భారతీయ బౌద్ధ మహా సభ ఆధ్వర్యంలో 10 రోజుల పాటు నిర్వహించిన శ్రామినార్స్ శిబిరం ముగిసింది. గౌతం బన్సోడే మరియు గంగాధర్ బన్సోడే ఆధ్వర్యంలో ఈ శిబిరం ఏర్పాటు చేయబడింది. ఈ కార్యక్రమంలో 25 మంది శ్రామినార్స్ పాల్గొని బుద్ధుడు కఠిన నియమాలను పాటిస్తూ, ఆయన జీవిత చరిత్రపై ప్రవచనాలు విని, బుద్ధుడు ధరించిన వస్త్రాలు ధరించి పది రోజుల పాటు శిబిరంలో ఉన్నారు. శిబిరం ముగింపు సందర్భంగా, బంతే ధమ్మం సాగర్, భారత్ వాద్‌తో కలిసి బుద్ధ వందనాలు నిర్వహించారు. వారు శ్రామినార్స్‌ను ఆశీర్వదించి, ప్రతి రోజు బుద్ధ వందనాలు చేయాలని, అలాగే స్వేచ్ఛ జీవితం గడపాలని సూచించారు. ఈ శిబిరం ద్వారా, శ్రామినార్స్ కఠిన నియమాలు పాటిస్తూ, మంచి జీవితం గడపాలని, బుద్ధుడి జీవితాన్ని అనుసరించి మరింత లోతుగా తెలుసుకోవాలని, ప్రభాకర్ గాడ్వాలె వారు పిలుపు ఇచ్చారు. శిక్షణ పూర్తిచేసిన 25 మందికి సర్టిఫికేట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో గౌతం బన్సోడే, గంగాధర్ బన్సోడే, భారతీయ బౌద్ధ మహా సభ రాష్ట్ర అధ్యక్షులు అబ్బురావ్ వాగ్మారే, సమతా సైనిక్ దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నారాయణ్ వాగ్మారే, భారతీయ బౌద్ధ మహా సభ నాయకులు, మహిళలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా, గౌతం బన్సోడే, గంగాధర్ బన్సోడే ప్రతి రోజు అన్నదానం ఏర్పాటు చేసి, శ్రామినార్స్, కార్యక్రమానికి హాజరైన వారికి భోజనాలు అందించారు.

# తహశీల్దార్ కార్యాలయంలో ప్రజా సంఘాల వినతి



**బొంరాస్‌పేట, మే 13 (జనస్వరం) :** మండల పరిధిలోని రేగడిమైలారం గ్రామానికి చెందిన దళిత రైతు కడంపల్లి బాలయ్య పొలం నుండి బాపన్ చెరువు తాండ వరకు రోడ్డు వేసే కాంట్రాక్టర్ ఎలాంటి నోటీసు ఇవ్వకుండా దౌర్జన్యంగా రోడ్డు వేయడాన్ని ఆపి తగు న్యాయం చేయాలని కోరుతూ మంగళవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆర్ఐ శిరీష కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు బుస్స చంద్రయ్య, కొత్తూరు చంద్రయ్య, దస్తప్ప ఎం.వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# తల్లికి తెలియకుండా ఆస్తి కాజేసీ పట్టించుకోని కొడుకులు - ఫిర్యాదు



**మంగళగిరి, మే 13 (జనస్వరం) :** దూలిపర్తి దమయంతి అనే వృద్ధురాలు తన కొడుకులు తనకు తెలియకుండా తన ఆస్తిని అక్రమంగా నెల్లూరులో రిజిస్టర్ చేయించుకున్నారని, తమను పట్టించుకోవడం లేదని ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తిలకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు టీడీపీ కేంద్ర కార్యాలయంలో ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమంలో మంగళవారం స్వీకరించారు. వైసీపీ నేతల రియల్ వెంచర్‌పై రైతుల ఆందోళన

**నంద్యాల :** జమ్మలమడుగు జాతీయ రహదారి నిర్మాణం కోసం చేపట్టిన భూ సేకరణ ప్రక్రియను నిలిపి వేసినట్లు వైసీపీ నాయకులు తమ రియల్ వెంచర్ కోసం ప్రతిపాదనలు చెలామణీ చేసినారని, దీనివల్ల పేద రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. వారు ఈ విషయాన్ని అధికారులకు అందజేసి రైతుల నష్టాలను పోగొట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.


**తిరుపతి :** బీఎన్ కండ్రిక గ్రామానికి చెందిన టీడీపీ మండల అధ్యక్షులు మావిళ్లపల్లి సుధాకర్ నాయుడు, పంచాయతీల మధ్య కాళంగి నదిపై చెక్ డ్యామ్, కాజ్ వేను నిర్మించాలని, నీటి సమస్యను పరిష్కరించేందుకు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు.

**చిత్తూరు :** జిల్లాలోని నెలవాయి గ్రామానికి చెందిన తుమ్మల కన్నయ్య నాయుడు, ఎన్ఆర్ఈజీఎస్ క్రింద 2018లో చేపట్టిన పనుల బిల్లులు ఇప్పటివరకు రాలేదని, వాటిని అందజేయాలని, అలాగే ఉన్నత పాఠశాల కోసం ప్రహరి నిర్మించడానికి గ్రాంట్ మంజూరు చేయాలని కోరారు.

**కాకినాడ :** పి.వేమవరం గ్రామానికి చెందిన ఎలిశెట్టి రోషిని, ఆరోగ్య కారణాల వల్ల కాలేజీకి వెళ్లలేకపోయింది. హాజరుపేరుతో హాల్ టికెట్ ఇవ్వకపోవడంతో ఆమె పరిక్షలకి వెళ్లలేకపోయింది. విద్యార్థిని, త్వరగా హాల్ టికెట్ అందించాలని న్యాయమైన విజ్ఞప్తి చేసింది.

**బాపట్ల :** రైతుల నుంచి నీటితీరువా వసూలు చేయడం పై రైతులు తీవ్రంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 2424, 2025 సంవత్సరాలకు వడ్డీతో నీటి తీరువా చెల్లించడానికి అధికారులు ఒత్తిడి పెడుతున్నారని, వడ్డీ లేకుండా పన్నులు చెల్లించాలని రైతులు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

# ఈదురు గాలులకు నేలకొరిగిన అరటి తోట



**పులివెందుల, మే 13 (జనస్వరం) :** ఈదురు గాలులకు అరటి తోట నేలకొరిగింది. సోమవారం రాత్రి వీచిన పెనుగాలులకు పులివెందుల మండల పరిధిలోని ఈ కొత్తపల్లి గ్రామంలో బాల వీరాంజనేయులు చెందిన నటి తోట ధ్వంసం అయింది. సుమారు 3 వేల చెట్లు నేలమట్టమైనట్లు రైతు బాల వీరాంజనేయులు తెలిపారు. చేతికందే దిశలో పంట నేల పాలవడం ఆ రైతు జీనించుకో లేకు న్నాడు. రైతు మాట్లాడుతూ సాగు కోసం లక్షలాది రూపాయలు పెట్టుబడి వెచ్చించానని తెలిపారు. పంటను కంటికి రెప్పలా కాపాడుకున్నానని తెలిపారు. ప్రభుత్వం స్పందించి దెబ్బతిన్న తోటను పరిశీలించాలని, పూర్తి స్థాయిలో పరిహారం చెల్లించాలని రైతు బాల వీరాంజనేయులు విజ్ఞప్తి చేశారు.

# అంతర్లలో అట్టహాసంగా ప్రారంభమైన గంగలమ్మతల్లి పండగ

**ఆదివాసి సంప్రదాయాలకు నిలయంగా గ్రామ దేవత సంకుదేవుడు ఆలయం కళాకళలు**





**చింతపల్లి, మే 13 (జనస్వరం) :** మండల కేంద్రానికి సమీపంలోని అంతర్ల గ్రామంలో ఆదివాసీ ప్రజల ఆధ్యాత్మికతకు, సంప్రదాయాలకు ప్రతిబింబంగా గంగలమ్మతల్లి (ఇటుకల) పండగ అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. గ్రామ దేవత సంకుదేవుడు ఆలయంలో జరిగే ఈ పండుగ ఆదివాసీ గిరిజనుల సాంస్కృతిక సంపదకు నిదర్శనంగా నిలుస్తోంది. గ్రామ మునసబు కవడం సోమరాజు ఆధ్వర్యంలో ఉత్సవాలను గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యుల నుంచి పసుపు, కుంకుమను స్వీకరించి హారతులు సమర్పిస్తూ గ్రామ సమైక్యత కు ప్రతీకగా మారారు. శనివారం నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో, పనసకాయను అడవి జంతువు మాదిరిగా శిల్పంగా తయారుచేసి, పక్కన కోడిగుడ్డు, కర్రికోడి పిల్లను ఉంచుతారు. వీటిపై బాణాలతో వేటాడే ఆనవాయితీ ఆదివాసి వేట జీవనశైలిని ప్రతిబింబించింది. ఈ విశిష్ట సంప్రదాయం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటుంది. తాచేరులో గ్రామస్తులంతా ఒకచోట చేరి, సాంప్రదాయ నృత్యాలు, పాటలతో సంబరాలు నిర్వహించుకుంటారు. పెద్దల ఆశీర్వాదాలు, పిల్లల క్రీడలతో పండుగ వాతావరణం ఉత్సాహభరితంగా మారుతుంది. వారం రోజులపాటు ఈ పండగ కొనసాగనున్నాయి. శనివారం నుంచి మగవాళ్లు అటవీ ప్రాంతాలకు వెళ్లి వేట నిర్వహి స్తారు. ఈ సందర్భంగా, వేట విజయవంతం కాకపోతే, వారు ఖాళీ చేతులతో తిరిగిరాగానే మహి ళలు వారి చేతగానితనాన్ని ఎత్తిచూపుతూ గిరిజన సాంప్రదాయ ఆటపాటలతో ముక్తకంఠంతో విమర్శిస్తారు. ఇది ఒక ప్రత్యేకమైన సామాజిక సంప్రదాయంగా నిలుస్తుంది. గంగాలమ్మతల్లి పండుగను పురస్కరించుకొని గిరిజన మహిళలు సాంప్రదాయ ఉత్సాహంతో పాల్గొంటున్నారు. ఉత్సవా ప్రారంభమైన నాటినుంచి వారం రోజులపాటు మహిళలు ఉయ్యాలలు కట్టి, ఊగుతూ గిరిజన సంప్రదాయ గీతాలను ఆలపిస్తూ వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు. ముఖ్యం గా ప్రధాన రహదారులపై తాచేరు నిర్వహించి, రాకపోకలకు అడ్డుగా నిలుస్తూ వాహనాల నుంచి చిల్లర రూపంలో విరాళాలను వసూలు చేస్తూ పండుగ ఉత్సాహాన్ని మరింతగా పెంపొందిస్తు న్నారు. గిరిజన మహిళల సామూహిక భాగస్వామ్యం, గిరిజన సంస్కృతి పరిరక్షణ, భక్తిశ్రద్ధలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. పండుగ సందర్భంలో ఈ తరహా ప్రజాలు పాల్గొని సాంస్కృతికంగా మేళవించబడిన ప్రజా భక్తిని ప్రతిబింబిస్తుంది. ఈ ఉత్సవాలలో పురుషులు, మహిళలు పరస్పరం బురద నీళ్లు, పేడ నీళ్లు ఒకరిపై ఒకరు చల్లుకుంటూ పండుగను హర్షాతిరేకంగా జరుపుకుం టారు. ఇది గ్రామ ప్రజల ఐక్యతకు, ఆనందోత్సాహాలకు చిహ్నంగా నిలుస్తోంది.

# కోరుకొండ సచివాలయం ముస్తాబు.. ప్రారంభానికి సిద్ధం

**అధికారులు స్పందించాలని ప్రజల విజ్ఞప్తి**



**చింతపల్లి, మే 13 (జనస్వరం) :** మండలంలోని మారుమూల ప్రాంతంగా గుర్తింపు పొందిన బలపం పంచాయతీ పరిధిలోని కోరుకొండ గ్రామంలో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం పూర్తి కావడంతో స్థానిక ప్రజల్లో ఆనందం నెలకొంది. పూర్తిగా ముస్తాబు అయిన ఈ భవనం త్వరిత గతిన ప్రారంభమైతే, పంచాయతీ పరిపాలన మరింత సమర్థవంతంగా సాగుతుందని స్థానికులు భావిస్తున్నారు. గ్రామ స్థాయిలో పరిపాలనను ప్రజలతో దగ్గర చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ ప్రయోజనాలను కోరుకొండ వాసులు ఎదురుచూస్తున్నారు. ఈ భవనం ప్రారంభమైతే, పంచాయతీకి సంబంధించిన రికార్డుల భద్రతకు తోడ్పడడంతోపాటు, ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలు మరింత వేగంగా, సమర్థవంతంగా అందుతాయని అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం భవనం పూర్తిగా సిద్ధంగా ఉన్నా, అధికారుల నుంచి ప్రారంభానికి సంబంధించిన చర్యలు ఇంకా చేపట్టలేదు. గ్రామస్తులు స్పందిస్తూ, ఇప్పటికే నిర్మాణం పూర్తైన భవనాన్ని వెంటనే ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలంటూ అధికారులను వేడుకుంటున్నారు. ప్రజాపాలనలో పారదర్శకత, సమర్థత పెంచే దిశగా ఈ సచివాలయం ఉపయుక్తంగా నిలుస్తుందని బలపం పంచాయతీ ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# గోతులగుట్టగా మారిన కోరుకొండ ప్రధాన రహదారి.. ప్రజల బతుకుల బందీ

- గోతుల్లో నాణెం పడితే మింగిపోతుంది
- నిధులు మంజూరైనా.. నిర్మాణం నెత్తురోడు
- పతనావస్థలో బలపం - కోరుకొండ ప్రధాన రహదారి





**చింతపల్లి, మే 13 (జనస్వరం) :** అల్లూరి సీతారామరాజు జిల్లాలోని మారుమూల ప్రాంతంగా పేరొందిన బలపం, కుడుముసారి పంచాయతీలకు జీవనాడిగా భావించబడే బలపం–కోరుకొండ ప్రధాన రహదారి ప్రస్తుతం గోతుల గుట్టగా మారింది. గత కొన్ని సంవత్సరాలుగా నిర్లక్ష్యానికి లోనవుతున్న ఈ మార్గం వర్షాకాలం రాకముందే పూర్తిగా దెబ్బతిన్నదని స్థానికులు వాపోతున్నారు. ప్రతి పది అడుగులకు ఓ గోతు కనిపించడం, చిన్న వాహనాలు తిరగలేని స్థితి రావడం, అంబులెన్స్‌లు ఆలస్యంగా చేరడం వంటి సమస్యలు రోజురోజుకు మారిపోయాయి. ప్రజల పునరావృత విన్నపాలపై స్పందించిన అల్లూరి జిల్లా ఉన్నతాధికారులు లోతుగడ్డ వంతెన నుండి కోరుకొండ కేంద్రం వరకు రహదారి అభివృద్ధికి నిధులు మంజూరు చేసినట్టు ప్రకటించినా.. ఇప్పటివరకు పనులు ప్రారంభించకపోవడం స్థానికులను తీవ్ర నిరాశకు గురి చేస్తోంది. మంజూరైన నిధులు కేవలం కాగితాల మీదే మిగిలిపోతున్నాయని ఆరోపిస్తున్నారు. పాఠశాల విద్యార్థులు నుండి వృద్ధులు, గర్భిణీలు మరియు అత్యవసర వైద్యం అవసరమున్నవారు ఈ రోడ్డులో ప్రయాణించాల్సి రావడం వల్ల తీవ్ర ఇబ్బందులకు లోనవుతున్నారు. ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు, అత్యవసర రోగులు లోతుగడ్డ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, చింతపల్లి ప్రాంతీయ ఆసుపత్రికి తరలించడంలో ఆలస్యం కారణంగా అనేకసార్లు ప్రాణాలు కోల్పోయిన ఘటనాలు, అపస్మారక పరిస్థితులు తలెత్తిన ఉదంతాలు ఉన్నాయని పంచాయతీల ప్రజలు వాపోతున్నారు. ప్రతి ఏడాది వర్షాకాలం ముందు ఈసారి తప్పకుండా రహదారి పనులు చేపడతాం అనే హామీలు అధికారుల నుంచి వెలువడుతున్నా, నేలపై ఫలితాలు కనిపించకపోవడం ప్రజల్లో అసహనానికి దారితీస్తోంది. రహదారిలో నిరంతరం ఆటోలు, వ్యాన్లు, ద్విచక్ర వాహనాలు స్తంభించి పోవడం, మోటారు సైకిళ్లు తలకిందులవడం వంటి సంఘటనలు సాధారణమయ్యాయి. ఇది మా మారుమూల గ్రామాల సమస్య కాదు. వందలాది కుటుంబాల జీవనాధార మార్గం ఇది. వ్యవసాయ ఉత్పత్తులు, విద్య, వైద్యం అన్నీ ఈ రహదారిపై ఆధారపడినవే. ఇక ఆలస్యం చేయకుండా తక్షణమే రహదారి నిర్మాణ పనులు ప్రారంభించాలని బలపం, కుడుముసారి పంచాయతీల ప్రజలు పాలకులను కోరుతున్నారు. వినిపించే వాగ్దానాలు కాదు, కనిపించే పనులే ప్రజలు కోరుతున్నారని స్పష్టం చేస్తూ, అధికారులు లోతుగడ్డ వంతెన నుండి కోరుకొండ కేంద్రం వరకు రహదారి పునర్నిర్మాణానికి వెంటనే శాస్వత చర్యలు తీసుకోవాలని బలపం, కుడుముసారి పంచాయతీల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# భూ వివాదాల పరిష్కారమే రీ సర్వే లక్ష్యం

**ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి**





**కోవూరు, మే 13 (జనస్వరం) :** గ్రామీణ భూముల పరంగా ఏళ్ల పాటు కొనసాగుతున్న వివాదాలను పరిష్కరించడమే భూ రీ సర్వే ప్రధాన ఉద్దేశమని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తెలిపారు. కోవూరు మండలంలోని వేగూరు గ్రామంలో నిర్వహించిన రీ సర్వే గ్రామసభలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆమెతో పాటు నెల్లూరు రెవెన్యూ డివిజనల్ అధికారి అనూష, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గతంలో వందేళ్ల క్రితం రూపొందించిన భూ రికార్డుల ఆధారంగా భూ లావాదేవీలు కొనసాగుతున్నాయని, ఇప్పటి ఆధునిక అవసరాలకు అనుగుణంగా భూముల ఖచ్చితమైన కొలతలు, హద్దుల నిర్ధారణ అవసరమైందని వివరించారు. ఈ నేపథ్యంలో రీ సర్వే ద్వారా భూములకు శాస్త్రీయ పద్ధతిలో హద్దులు నిర్ణయించి, భవిష్యత్తులో భూ వివాదాలు తలెత్తకుండా చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

**సాటిలైట్ టెక్నాలజీ ఆధారంగా ఖచ్చితమైన కొలతలు :**
అడ్వాన్స్‌డ్ సాటిలైట్ టెక్నాలజీ ద్వారా ప్రతి గ్రామంలో ప్రభుత్వ భూములు, పట్ల భూములు ఎంత ఉన్నాయన్న విషయాలు స్పష్టంగా తెలియజేస్తారని, అందుకు అనుగుణంగా రైతులకు కొత్త పాస్ బుక్‌లు మంజూరు చేస్తారని ఆమె తెలిపారు. పాత రికార్డుల్లో తప్పిదాలుంటే రీ సర్వే ప్రకారం వాటిని సరిచేస్తారని చెప్పారు.

**క్రయ విక్రయాల్లో మోసాలకు అడ్డుకట్ట :**
రీ సర్వే ద్వారా భూ కొనుగోలు, విక్రయాల్లో జరుగుతున్న మోసాలను అరికట్టడమే కాక, ఆక్రమణలను కూడా పూర్తిగా నియంత్రించవచ్చని ఆమె స్పష్టం చేశారు. ప్రజల ఆస్తి హక్కును కాపాడడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని వివరించారు.

**గ్రామ సభల్లో సందేహ నివృత్తి :**
గ్రామ సభలు ఈ రీ సర్వేలో కీలక పాత్ర పోషిస్తున్నాయని, ఎవరికి అయినా అభ్యంతరాలు, సందేహాలు ఉంటే అధికారులు వాటిని అక్కడికక్కడే నివృత్తి చేస్తారని చెప్పారు. రైతులు అధికారులతో సమన్వయం పాటించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**డిజిటల్ భూ లావాదేవీల యుగం :**
రీ సర్వే పూర్తయ్యాక సేకరించిన భూ వివరాలు డిజిటలైజ్ చేయనున్నట్లు, పాత సర్వే నంబర్లను రద్దు చేసి, తాజా టెక్నాలజీ ఆధారంగా భూ లావాదేవీలు నిర్వహించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెన్నా డెల్టా చైర్మన్ జెట్టి రాజగోపాల్ రెడ్డి, వేగూరు సర్పంచ్ కరేటి అమరావతి, కోవూరు జనసేన మండల అధ్యక్షులు అల్తాఫ్, తహసిల్దార్ నిర్మలానంద బాబా, డిప్యూటీ తహసిల్దార్ మధు, ఎంపీడీఓ శ్రీహరి రెడ్డి, ఎంపీపీ పార్వతి, టిడిపి అధ్యక్షులు ఇంత మల్లారెడ్డి, ఇతర నేతలు, అధికారులు, స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జాబ్ కార్డులు పొందిన ప్రతి ఒక్కరికి ఉపాధి కల్పించాలి

**జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి**



**దెందులూరు, మే 13 (జనస్వరం) :** జిల్లాలో ఉపాధి హామీ పనులను వేగవంతంగా కొనసాగించాలని, జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి పని కల్పించాలనే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. మండలంలోని సానిగూడెం గ్రామంలో రూ.25 లక్షలతో చేపట్టిన కొత్త చెరువు త్రవ్వకం పనులను మంగళవారం కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వేసవిలో కూలీలకు తగిన విధంగా త్రాగునీరు, మజ్జిగ వంటి సౌకర్యాలు ఉండాలని, ఉదయం 6 గంటల నుంచి 10 గంటల లోపు పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కూలీలకు వడదెబ్బల నుంచి రక్షణగా శిబిరాలు, శీతల నీటి సరఫరా, ప్రథమ చికిత్సా కిట్లు అందుబాటులో ఉండాలని సూచించారు. పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా సాగాలని, అవి రైతులకు, గ్రామ ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలని తెలిపారు. ఈ చెరువు తవ్వకం ద్వారా 68 ఎకరాలకు సాగునీటి లభ్యత కలుగనుంది. మంగళవారం పనిలో పాల్గొన్న కూలీలను కలెక్టర్ కలుసుకొని వారి సమస్యలు, అభిప్రాయాలు తెలుసుకున్నారు. మస్తరు షీటును పరిశీలించిన ఆమె, నాలుగు మంది హాజరు కాకపోవడానికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. వారు పామాయిల్ కోత పనికి వెళ్లినట్టు తెలియజేయగా, అక్కడి కూలి రూ.500, ఉపాధిహామీ కూలి రూ.290 కాగా, మరో 10 నిమిషాలు పనిచేస్తే రూ.307 లభిస్తుందని కలెక్టర్ వివరించారు. కేవలం నాలుగు గంటల పనికి ఈ మొత్తాన్ని ఇవ్వడం పట్ల కూలీలు హర్షం వ్యక్తం చేశారు. కూలీలు తినే భోజనానికి ఏర్పాటు చేసిన చలువరాతి పందిర్లను, ప్రథమ చికిత్సా పెట్టెను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. వడదెబ్బ లక్షణాలు, జాగ్రత్తలపై శ్రామికులకు అవగాహన కల్పించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ సమయంలో ఉపాధి హామీ పనులను వేగవంతంగా పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఉపాధిహామీ పనుల ద్వారా గ్రామాలు అభివృద్ధి బాటలోకి రావాలని, రోడ్లు, డ్రైనేజీలు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ఈ పథకం ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. గ్రామ ప్రజల వలసలను తగ్గించడంలో ఇది కీలకంగా మారుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో యం.అచ్యుత అంబరీష్, డ్వామా పీడీ కె.వి. సుబ్బారావు, తహశీల్దార్ బి.సుమతి, ఎంపీడీవో కె.శ్రీదేవి, ఏపీఓ పి. ఫాతిమా, గ్రామ సర్పంచి సన్నిపల్లి రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి యన్.రవికిషోర్, మాజీ సర్పంచి యలమర్తి శ్రీనుబాబు, గ్రామ సచివాలయ సిబ్బంది, నరేగా టెక్నికల్ టీం, ఆశావర్కర్లు, ఉపాధిహామీ కూలీలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలి

**పెదపాడు గ్రంథపాలకులు దుగ్గిపోగు జాన్ బాబు**



**పెదపాడు, మే 13 (జనస్వరం) :** గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలుగా నిలుస్తాయని, విద్యార్థులందరూ పుస్తక పఠనాన్ని నిత్యచర్యగా మార్చుకోవాలని పెదపాడు శాఖా గ్రంథాలయాధికారి దుగ్గిపోగు జాన్ బాబు పేర్కొన్నారు. మంగళవారం పెదపాడు గ్రంథాలయంలో ఉచిత వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా సచివాలయ మహిళా పోలీస్ పిట్ట దివ్య "పోక్సో చట్టం" గురించి విద్యార్థులకు వివరంగా తెలియజేశారు. బాలలు, బాలికలు విద్యార్థిదశలోనే మంచి నడవడి అలవర్చుకోవాలని, ఎవరి చేతైనా వేధింపులు ఎదురైతే చట్టపరంగా బలమైన చర్యలు తీసుకోబడతాయని స్పష్టం చేశారు. చిన్నతనంలోనే చక్కటి లక్ష్యాలను నిర్ణయించుకొని, చదువులో రాణించి తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని సూచించారు. తదుపరి కార్యక్రమంలో వాసాల నరసయ్య రచించిన "మీ మెదడుకు పదునెత్త" అనే పుస్తకంలోని పొడుపు కథలను బాలబాలికలచే చదివించారు. ఇది పిల్లల్లో పఠనాభిరుచిని పెంపొందించడంలో భాగంగా చేపట్టిన చర్యగా పేర్కొన్నారు. అనంతరం జానపద పాటలు నేర్పించి విద్యార్థులచే పాడించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 34 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని గ్రంథాలయ అధికారి దుగ్గిపోగు జాన్ బాబు ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు. విజ్ఞానాన్ని సంపాదించేందుకు పుస్తకాలు అత్యుత్తమ సాధనమని, చిన్న వయస్సులోనే పఠనాన్ని అలవర్చుకుంటే మంచి వ్యక్తిత్వంతో పాటు స్పష్టమైన లక్ష్యాలు ఏర్పడతాయని జాన్ బాబు పేర్కొన్నారు.

# చదరంగం క్రీడా ఏకాగ్రతను పెంచుతుంది



**నంద్యాల, మే 13 (జనస్వరం) :** నంద్యాల జిల్లా చెస్ సంఘం ఆధ్వర్యంలో, జిల్లా చదరంగం సంఘం ప్రధాన కార్యదర్శి రామ సుబ్బా రెడ్డి నిర్వహణలో మంగళవారం సంజీవ నగర్ లో ఉన్న రామకృష్ణ విద్యాలయం ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో 11సంవత్సరాల లోపు బాల బాలికల జిల్లా స్థాయి చదరంగం పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో నంద్యాల జిల్లా చెస్ సంఘం అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ ముఖ్య అతిథిగా, గౌరవ అతిథులుగా ఎన్.ఆర్.జి.చెస్ అకాడమీ గౌరవాధ్యక్షులు రాజేష్, క్రీడాభారతి జిల్లా కార్యదర్శి నిమ్మకాయల సుధాకర్ పాల్గొన్నారు. డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ చదరంగం క్రీడ ఏకాగ్రతను ఇనుముడింప చేస్తుందని, తద్వారా చదువులో కూడా రాణించడానికి అవకాశాలు అధికమవుతాయన్నారు. మొబైల్ ఫోన్ పిల్లలలో దుష్ప్రభావం చూపుతున్నదని, దాని నుంచి పిల్లల దృష్టి క్రీడలపై ఉండేలా చేస్తే పిల్లల మేధో వికాసం జరుగుతుందన్నారు. నిమ్మకాయల సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు, కళలు వారి వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేస్తాయని అన్నారు. రాజేష్ మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలలో పాల్గొంటే క్రమశిక్షణ కూడా అలవడుతుందని, తల్లిదండ్రులు విద్యార్థులను క్రీడలలో ప్రోత్సహించాలని కోరారు. డాక్టర్ రవికృష్ణ, రాజేష్ చదరంగం బోర్డుపై పావులు కదిలించి పోటీలు లాంచనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా చెస్ సంఘం కార్యదర్శి రామ సుబ్బారెడ్డి, క్రీడాభారతి జిల్లా కార్యదర్శి నిమ్మకాయల సుధాకర్, పాలిటెక్నిక్ కాలేజీ లెక్చరర్ రాజేష్‌లతోపాటు ఆర్బిటర్ సుజాత, వ్యాయామ ఉపాధ్యాయులు కళ్యాణ చక్రవర్తి, వందమంది క్రీడాకారులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# జీకే వీధి ఏకలవ్య మోడల్ పాఠశాల విద్యార్థులు ఘన విజయం


**టెన్త్, ఇంటర్ ఫలితాల్లో శతశాతం ఉత్తీర్ణత**



**చింతపల్లి/జీకే వీధి, మే 13 (జనస్వరం) :** మండలంలోని జీకే వీధి ఏకలవ్య ఆదర్శ మోడల్ పాఠ శాల విద్యార్థులు ఇటీవల విడుదలైన పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరిక్షల ఫలితాల్లో విశేష ప్రద ర్శనతో శతశాతం ఉత్తీర్ణత సాధించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.వి. రమణారావు వెల్లడించిన వివ రాల ప్రకారం, ఈ సంవత్సరం పదవ తరగతి పరీక్షలకు 60 మంది విద్యార్థులు హాజరవగా, వారం దరూ ఉత్తీర్ణత సాధించారు. అలాగే, ఇంటర్మీడియట్ పరీక్షలు రాసిన 74 మంది విద్యార్థులు కూడా పూర్తి ఉత్తీర్ణతను సాధించడం గర్వకారణమని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపిన జీకే వీధి సీఐ వరప్రసాద్, మండల తహశీల్దార్ టి.రామకృష్ణ, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు ప్రిన్సిపాల్ ఎం.వి. రమణారావును ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థుల కృషి, అధ్యాపకుల సూచనలు, పాలకుల నిబద్ధత ఈ విజయానికి ప్రధాన కారకాలుగా పేర్కొన్నారు. విద్యా ప్రాంగణంలో ఈ ఘనత స్థానికంగా విశేషంగా ప్రశంసలు పొందుతోంది. ఉత్తమ విద్యా ప్రమాణాలకు ప్రతీకగా నిలిచిన జీకే వీధి ఏకలవ్య మోడల్ పాఠశాల పట్ల గౌరవం మరింత పెరిగిందని అభిప్రాయపడుతున్నారు.

# త్వరలోనే పార్టీ కమిటీలను పూర్తి చేస్తాం

**వైసీపీ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు**



**ప్రత్తిపాడు, మే 13 (జనస్వరం) :** నియోజకవర్గంలో త్వరలోనే గ్రామ స్థాయి నుండి పూర్తిస్థాయిలో కమిటీలు పూర్తి చేస్తామని పార్టీలో కష్టపడే వారికి గుర్తింపు ఉంటుందని వైసీపీ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. కిర్లంపూడిలో ముద్రగడ నివాసంలో రౌతులపూడి ఏలేశ్వరం ప్రత్తిపాడు మండలాలకు చెందిన వైసీపీ నాయకులు కార్యకర్తలు కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. రౌతులపూడి మండల వైస్ ఎంపీపీ సూరెడ్డి సాయి దొర గిరిబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. గిరిబాబు మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేసేలా అందరం కష్టపడి పని చేయాలని కూటమి ప్రభుత్వం చేసే వైఫల్యాలను ప్రజలు గమనిస్తున్నారని వాటిని ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు.

# కేశినేని నానిపై తీవ్ర స్థాయిలో ఆరోపణలు

**- ఆర్థిక నేరాలపై సీబీఐ, ఈడీ విచారణ**

**- టీడీపీ నేత నాగుల్ మీరా డిమాండ్**



**విజయవాడ, మే 13 (జనస్వరం) :** మాజీ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని)పై ఆర్థిక మోసాలకు సంబంధించి తీవ్ర ఆరోపణలు వచ్చాయి. ఆయన బ్యాంకుల నుంచి తీసుకున్న లోన్లు తిరిగించకుండా ఎగవేసి, వాటిని షెల్ కంపెనీలకు మళ్లించారని ఆరోపిస్తూ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నాగుల్ మీరా మీడియా సమావేశంలో సంచలన వ్యాఖ్యలు చేశారు.

**బ్యాంకులను మోసం చేసిన ఘనుడు :**
కేశినేని హోటల్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ నుంచి తీసుకున్న రూ.42 కోట్ల లోన్‌ను తిరిగించకుండా, ఆ సంస్థను నాన్-పర్ఫార్మింగ్ అసెట్‌గా మార్చారని తెలిపారు. హోటల్ డైరెక్టర్లను మార్చి, ఆంధ్ర క్యాంటీన్ పేరుతో తన కుమార్తెల పేర్లపై రెస్టారెంట్‌ను నడుపుతూ, లాభాలు సంపాదిస్తున్నప్పటికీ, బ్యాంక్ లోన్‌ను మాత్రం తిరిగించడం లేదన్నారు.

**షెల్ కంపెనీలకు డబ్బుల మళ్లింపు-టాటాను కూడా మోసం? :**
నాని తన హోటల్స్ ఆధీనంలోని ఆస్తులను తాకట్టు పెట్టి లోన్ తీసుకున్నారని, అదే ఆస్తులను నారాయణ కాలేజీ, టాటా కంపెనీలకు లీజుకు ఇచ్చి కోటి రూపాయలు అడ్వాన్స్ తీసుకున్నారని చెప్పారు. టాటా లాంటి ప్రఖ్యాత కంపెనీని కూడా మోసం చేసిన ఘనుడు కేశినేనినేనని మండిపడ్డారు.

**అసత్య ఆరోపణలు చేయడానికి నైతిక హక్కు లేదన్న టీడీపీ :**
ఎంపీ కేశినేని శివనాథ్ నైతికతతో పనిచేస్తున్న నాయకుడిగా ప్రజల మద్దతు పొందుతున్నారని, అలాంటి వ్యక్తిపై అసత్య ఆరోపణలు చేయడమేంటని నాగుల్ మీరా ప్రశ్నించారు. నానిపై సీబీఐ, ఈడీ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. బ్యాంక్ అధికారుల తీరుపై కూడా ప్రశ్నలు లేవనెత్తారు.

**కుటుంబాన్ని, మిత్రులను దూరం చేసుకున్న నాని :**
కేశినేని నాని అసూయ, అహంకారం వల్ల తల్లి, చెల్లి, స్నేహితులందరినీ దూరం చేసుకున్నారని విమర్శించారు. ప్రస్తుతం నానికి ఎవరు మిగిలారని ప్రశ్నించారు. "నువ్వు గెలిపించిన నాయకులపై విశ్వాసం లేకపోతే, నీ నిజాయితీని ప్రజలు ఎలా నమ్మాలి?" అని సూటిగా ప్రశ్నించారు.

**గతంలో ఇచ్చిన మద్దతుకు మన్నించలేని నిందలు :**
నానిని రెండు సార్లు ఎంపీగా గెలిపించిన పార్టీ, నాయకులు, ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్, సినీ నటుడు చిరంజీవి వంటి నాయకులపై నిందలు వేయడం తగదన్నారు. ఇది కృతజ్ఞత లేని ప్రవర్తన అని వ్యాఖ్యానించారు. ఎవరైనా ఎదుగుతున్నారంటే, నాని ఓర్వలేని స్వభావంతో అసత్య ఆరోపణలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

**జైలు పాలయ్యే గురుశిష్యులు :**
తన రాజకీయ గురువు జగన్ మోహన్ రెడ్డి మాదిరిగా, కేశినేని నాని కూడా త్వరలో జైలు పాలవుతారని నాగుల్ మీరా వ్యాఖ్యానించారు. "రేపు ఇద్దరూ ఒకే సెల్‌లో చార్లెస్ శోభరాజ్ గురించి చర్చించుకుంటారు," అంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.

**ఆధారాలతో కూడిన ఆరోపణలు :**
నాని చేసిన అక్రమాలపై ఆధారాలు తమ వద్ద ఉన్నాయని, ట్రిబ్యునల్‌లో కేసులు, హోటల్ బిల్లులు, అగ్రిమెంట్లు అన్నీ తమ వద్ద ఉన్నాయని చెప్పారు. ఇకనైనా నాని తన వాఖ్యానాలపై ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు. లేకపోతే ప్రజల ముందే మరింత అవమానానికి గురవుతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సోంగా సంజయ్ వర్మ, విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ కార్యదర్శి కొట్టేటి హనుమంతు రావు, టీడీపీ సీనియర్ దళిత నాయకుడు కామా దేవరాజ్ పాల్గొన్నారు.

## రూ. 50వేల చొప్పున పరిహారం ఇవ్వాలి



**పులివెందుల మే 13 (జనస్వరం) :** ప్రకృతి వైపరీత్యాల కారణంగా దెబ్బతిన్న ప్రతి రైతుకు ఎకరాకు రూ. 50వేల చొప్పున పరిహారం అందించాలని కాంగ్రెస్ పులివెందుల ఇన్ ఛార్జి ధ్రువకుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. మండల పరిధిలోని ఎర్రబల్లి, కొత్తపల్లి గ్రామాలలో సోమవారం అర్ధరాత్రి కురిసిన వర్షాలకు ఈదురుగాలులకు దెబ్బతిన్న అరటి పంటలను ఆయనతో పాటు మండల అధ్యక్షుడు అనిల్ కుమార్ రెడ్డిలు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అకాల వర్షాలకు దెబ్బతిన్న అరటి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని వారన్నారు. అరటిదెబ్బతిన్న ప్రతి రైతుకు ఎకరాకు 50 వేల రూపాయలు ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొత్తపల్లి పంచాయతీలోని రైతు రామాంజనేయులు యాదవ్ 3ఎకరాల అరటి తోట పూర్తిగా దెబ్బతినిందని దాదాపు అతను 3 లక్షల రూపాయలు ఖర్చు చేశారన్నారు. అరటిపంట దెబ్బతిన్న రైతు రామాంజనేయులతో వారు మాట్లాడి పంటకు వెచ్చించిన పెట్టుబడి వివరాలు తెలుసుకున్నారు. రైతులకు పంట చేతికి వచ్చే టయానికి ఇప్పటికి మూడోసారి ఇలా జరగడమని వారన్నారు. హెక్టార్కు రూ.30వేలు ఇస్తే రైతులకు సరిపోదని, ఎకరాకు రూ.50 వేల ఇవ్వాలన్నారు. ఒక నెల ఉంటే రైతుల చేతికి పూర్తి పంట వచ్చే సమయానికి ఇలా జరగడం చాలా బాధాకరమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులను ఆదుకోవాలన్నారు. అనంతరం వారు శరవాణి ద్వారా తహసిల్దార్‌తో మాట్లాడి దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సప్తగిరి రెడ్డి, రాజ్ కుమార్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, విజయ్, వినయ్, సాయి, తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## మౌనిక నేత్రదానం



**పులివెందుల, మే 13 (జనస్వరం) :** కడప జిల్లా వీరపు నాయని పల్లి మండలం పాయసం పల్లి గ్రామానికి చెందిన నేసే మౌనిక (18) మంగళవారం మరణించడంతో ఆమె తల్లి లక్ష్మీదేవి, తండ్రి ల్యాబ్ టెక్నీషియన్ సురేష్, చెల్లెలు స్వరూప, జేజి లక్షుమ్మ, పెదనాన్నలు వెంకటరమణ, రామక్రిష్ణ, మనోహర్, పెద్దమ్మలు నేత్రదానానికి అంగీకరిస్తూ జిల్లా అంధత్వ నివారణ సంస్థ, స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షులు రాజులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న నేత్ర సేకరణ కేంద్రం టెక్నీషియన్ హరీష్‌తో కలిసి మృతురాలి గ్రామానికి వెళ్లి పార్థివ దేహం నుండి కార్నియాలను సేకరించారు. ఈ సందర్భంగా స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు మాట్లాడుతూ మనిషి మరణానంతరం మట్టిలో కలిసి పోయే నేత్రాలు అంధుల జీవితాల్లో చూపు ఇచ్చి సంజీవినిలా వెలుగులు ప్రసాదించే నేత్రదాన బృహత్కార్యం కోసం 9966509364 లేదా 7093204537లకు సమాచారం ఇచ్చి నేత్రదాన కార్యక్రమానికి ప్రతి కుటుంబం ముందుకు రావాలన్నారు. ఈ సందర్భంగా పుట్టెడు దుఃఖంలోను నేత్రదానానికి అంగీకరించిన కుటుంబ సభ్యులకు పులివెందుల పట్టణంలోని నగరిగుట్ట పట్టణ ప్రాథమిక వైద్యశాల వైద్యులు డాక్టర్ స్నేహ ప్రత్యూష సిబ్బంది, బంధువులు, సన్నిహితులు సేవా సమితి బృందం కృతజ్ఞత అభినందనలు తెలిపారు.

### ప్రజాస్వామ్యంలో ప్రశ్నిస్తే చంపుతారా ?

**- నన్ను చంపడానికి పళ్ళ చేసిన కుట్ర ఇది**

**- హొటల్లో సీసీటీవీ ఫుటేజ్ బయట పెట్టాలి**

**- ఏప్రిల్ 24న ఢిల్లీలో సీబీఐకు, కేంద్ర హొంమంత్రికి పల్లా శ్రీనివాస్‌పై తెలుగు శక్తి ఫిర్యాదు**

**- పోలీస్ కమిషనర్‌కు తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ ఫిర్యాదు**



**విశాఖపట్నం, మే 13 (జనస్వరం) :** ఒక బాధ్యత గల పౌరుడిగా ఏప్రిల్ 24న ఢిల్లీలో సీబీఐకు, కేంద్ర హొంమంత్రికి పల్లా శ్రీనివాస్ చేస్తున్న భూదందాలు కేంద్ర ప్రభుత్వం ఆస్తులు కబ్జాలపై ఒక నివేదిక తయారు చేసి సమర్పించారు. పల్లా శ్రీనివాస్ తనను హతమార్చడానికి ప్రయత్నం చేస్తున్నారని పోలీస్ కమిషనర్‌కు మంగళవారం మధ్యాహ్నం తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ ఫిర్యాదు చేశారు. హోటల్ సీసీ ఫుటేజ్ పరిశీలిస్తే పూర్తి విషయాల బయటపడతాయని తెలియజేశారు. నిన్న గాజువాక పోలీస్ స్టేషన్లో స్టేట్మెంట్ రికార్డ్ చేసుకున్నారని కానీ, ఈ రోజు ఒక పత్రికలో నేను కంప్లైంట్ ఇవ్వలేదని గాజువాక సీఐ చెప్పడం జరిగిందని రామ్ పోలీస్ కమిషనర్‌కు వివరించారు. అలాగే వీడియో కవరేజ్ చేస్తున్న ప్రైమ్ నైన్ ఛానల్ ప్రతినిధి జే.అర్జున్ రావుని పైన కూడా దాడి చేశారని ఆయనకి లెఫ్ట్ చెవ్వు పనిచేయట్లేదు అని డాక్టర్లు చెప్పడం జరిగింది అని తెలియజేశారు. పల్లా శ్రీనివాసరావు అతని అనుచరుల పైన క్రిమినల్ కేసు నమోదు చేసి న్యాయం చేయాలని పోలీస్ కమిషనర్‌ను కోరారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నిస్తే చంపుతారా.. కక్షతోనే పల్లా దాడి చేయిం చాదని రామ్ ఎప్పటికీ భయపడని న్యాయం కోసం ఎంత లెక్కనే పోరాటం చేస్తానని, ఈ సందర్భం గా తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ తెలియజేశారు

## డొక్కా సీతమ్మ మంచినీటి చలివేంద్రం ప్రారంభం



**సర్వేపల్లి, మే 13 (జనస్వరం) :** వేసవి కాలం వేడి పెరిగిపోతున్న నేపథ్యంలో జనసేన పార్టీ సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ పేరుతో మజ్జిగ చలివేంద్రం, మంచినీటి చలివేంద్రం ప్రారంభించారు. ఈ కార్యక్రమం పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు, ఆంధ్రుల అన్నపూర్ణమ్మ డొక్కా సీతమ్మ పేరుతో ఆంధ్ర ప్రదేశ్ మున్సిపల్ కార్పొరేషన్ డైరెక్టర్ గుమ్మినేని వాణి భవాని చేతుల మీదుగా ముత్తుకూరు మండల కేంద్రంలో ప్రారంభమైంది. బొబ్బేపల్లి సురేష్ నాయుడు మాట్లాడుతూ, "వేసవిలో విపరీతమైన ఎండల కారణంగా కార్మికులు, ప్రయాణికులు తీవ్ర దాహం అనుభవిస్తున్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు, ముత్తుకూరు మండలంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఈ మంచినీటి చలివేంద్రం ప్రారంభించాం. వేసవి కాలం పూర్తయ్యేంత వరకు ఈ చలివేంద్రం ప్రజలకు సేవ చేస్తుంది" అని పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్ సూచన మేరకు జనసేన పార్టీ ఎప్పుడూ ప్రజల పక్షాన నిలిచే పార్టీగా ఉంటుందని, ప్రజా సమస్యలపై జనసేన ఎన్నడూ అలుపెరగని పోరాటం చేస్తుందనేవిధంగా, సర్వేపల్లి నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు పాటుపడతారని బొబ్బేపల్లి సురేష్ నాయుడు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముత్తుకూరు మండల సీనియర్ నాయకులు రహీం వెంకటాచలం, మండల కార్యదర్శి సందూరి శ్రీహరి, చిన్న, అఖిలేష్ గౌడ్, ఇబ్రహీమ్ జానీ బాయ్, సమత్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## ఏలూరు జనసేన పార్టీ కార్యాలయంలో క్రియాశీలక సభ్యత్వం కిట్ల పంపిణీ




**ఏలూరు, మే 13 (జనస్వరం) :** జనసేన పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు, జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం సిబ్బంది మంగళవారం ఏలూరు నియోజకవర్గంలో క్రియాశీలక సభ్యత్వం కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐటీ టీమ్ సభ్యులు కొలవ ప్రసాద్, జనసేన పార్టీ ఏలూరు నియోజకవర్గ ఇంచార్జ్ రెడ్డి అప్పల నాయుడు పాల్గొన్నారు. రెడ్డి అప్పల నాయుడు మాట్లాడుతూ, "నియోజకవర్గంలో జనసేన పార్టీ సభ్యత్వం నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరికి క్రియాశీలక వాలంటీర్ల ద్వారా కార్డులు పంపిణీ చేస్తాం. జనసేన పార్టీ 12 లక్షల సభ్యత్వాలతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సంస్థాగతంగా బలమైన పార్టీగా ఎదిగింది. ఈ పథకం ద్వారా మా పార్టీ కార్యకర్తలకు, వారి కుటుంబాలకు భరోసా ఉంటుంది" అని తెలిపారు. పార్టీ కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉండేందుకు, పవన్ కళ్యాణ్ సరికొత్తగా ఆలోచించి ఒక ఇన్సూరెన్స్ పథకాన్ని ప్రవేశ పెట్టారని, ఇది పార్టీ సభ్యుల భద్రతకు ఒక కొత్త దారిని చూపిస్తుందని రెడ్డి అప్పల నాయుడు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం జనసేన పార్టీ జిల్లా నాయకులు, నియోజకవర్గ నాయకులు, క్రియాశీలక వాలంటీర్లు, ఇతర కార్యకర్తల సమక్షంలో ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు. "రానున్న రోజుల్లో నియోజకవర్గంలో మరిన్ని జనసేన పార్టీ సభ్యత్వాలు నమోదు చేసి పార్టీని మరింత బలోపేతం చేస్తాం. పవన్ కళ్యాణ్ నేతృత్వంలో పార్టీ కార్యకర్తలు, వారి కుటుంబాలకు అండగా నిలవడం, దినప్రతిపాదిత కార్యక్రమాలు ప్రజల భద్రతను, సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని రూపొందిస్తున్నాం" అని రెడ్డి అప్పల నాయుడు తెలిపారు.

## రసవత్తరంగా బండలాగుడు పోటీలు



**పులివెందుల, మే 13 (జనస్వరం) :** నియోజకవర్గంలోని లింగాల మండలం వెలిదండ్ల గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన బండలాగుడు పోటీలు రసవత్తరంగా సాగాయి. వైశాఖ శుద్ధ పౌర్ణమి వేడుకలను పురస్కరించుకుని గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను తిలకించేందుకు స్థానికంగానే కాకుండా చుట్టు పక్కల ప్రాంతాల వారు విశేష సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం బండలాగుడు పోటీల విజేతలకు గ్రామ పెద్దల ఆధ్వర్యంలో బహుమతులను అందజేశారు.

## చవాకుల సూర్య నరేష్ బాబుకు జాతీయ సామాజిక సేవా పురస్కారం



**పాలకొల్లు, మే 13 (జనస్వరం) :** ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టుల యూనియన్ (ఏపీజేయూ) 5వ వార్షికోత్సవం సందర్భంగా, విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రం వేదికగా, మాజీ రాష్ట్రపతి జ్ఞాని జైల్ సింగ్ నేషనల్ మెమోరియల్ అవార్డ్స్ 2025 కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సమాజానికి విశిష్ట సేవలు అందిస్తున్న పలువురు సేవా మూర్తులను సత్కరించి జాతీయ పురస్కారాలను అందజేశారు. ఇందులో భాగంగా పాలకొల్లుకు చెందిన చవాకుల చారిటబుల్ ట్రస్ట్ అధినేత చవాకుల సూర్య నరేష్ బాబును ఘనంగా సత్కరించారు. ఆపదలో ఉన్నవారికి చవాకుల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సేవా సహాయ కార్యక్రమాలు నిర్వహిస్తూ, విద్యార్థులకు స్కాలర్షిప్స్ అందజేస్తూ నేటి సమాజంలో అందరికీ ఆదర్శంగా నిలిచిన నేపథ్యంలో చవాకుల సూర్య నరేష్ బాబును గుర్తించి, ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ యూనియన్ ప్రతినిధులు, మైనారిటీ వ్యవహారాల సలహాదారులు, మాజీ శాసనమండలి అధ్యక్షులు ఎం.ఎ షరీఫ్ చేతుల మీదుగా ఘనంగా సత్కరించి జాతీయ సామాజిక సేవా పురస్కారాన్ని అందజేశారు. పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## ఉగ్రవాదంపై ఉక్కు పాదం మోపాలి

### రెడ్డి అప్పల నాయుడు పిలుపు



**ఏలూరు, మే 13 (జనస్వరం) :** ప్రపంచ వ్యాప్తంగా పెరిగిపోతున్న ఉగ్రవాదాన్ని తొలగించడం మనం దరికీ అత్యవసరమైందని రెడ్డి అప్పల నాయుడు అన్నారు. పాకిస్తాన్‌తో యుద్ధం చేస్తున్న భారత సైని కులకు ఆత్మస్థైర్యం కలిగించాలని కోరుతూ, జనసేన పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మంగళవారం, ఏలూరు పోస్టల్ కాలనీలోని శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఈ ప్రత్యేక పూజలు జరిగింది. రెడ్డి అప్పల నాయుడు మాట్లాడుతూ, "భారత్ శాంతియుత చర్చలు చేపడుతున్నా, పాకిస్తాన్ ఉగ్రవాదంతో యుద్ధానికి పాల్పడుతోంది. భారత సైన్యం దాడులు చేసి వారికి బుద్ధి చెప్పే సమయం వచ్చింది" అని చెప్పారు. పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు, సైనికులకు ఆత్మస్థైర్యం కలిగేలా, ప్రతి భారతీయుడు సైనికుల అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. భారత సైనికులు ఆపరేషన్ సింధూర్ విజయవంతంగా పూర్తి చేసి, దేశానికి గౌరవాన్ని చేకూర్చాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నేతలు, జనసేన ఎమ్మెల్యేలు, కార్యకర్తలు, వీర మహిళలు మరియు భక్తులు పాల్గొన్నారు. సభలో "భారత్ మాతా కీ జై", "వందేమాతరం" అంటూ జై కార్లతో కార్యక్రమం ముగిసింది. ఈ ప్రత్యేక పూజలు, అభిషేకాలు, భారత సైనికులకు దైవ అనుగ్రహం మరియు మరింత ధైర్యాన్ని ఇచ్చేలా నిర్వహించారని రెడ్డి అప్పల నాయుడు పేర్కొన్నారు. జనసేన పార్టీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు ఇతర పుణ్యక్షేత్రాల్లో కూడా సైనికుల కోసం పూజలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

## శాశ్వత అన్నదాన పథకానికి విరాళం



**శ్రీశైలం, మే 13 (జనస్వరం) :** శ్రీభ్రమరాంభమల్లికార్జునస్వామి వార్ల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పథకానికి మంగళవారం న్యూఢిల్లీకి చెందిన సందీప్ శర్మ రూ.1,16,000ల విరాళం మొత్తాన్ని పర్యవేక్షకులు జి.రవికు అందజేశారు. దాతకు విరాళానికి తగు రసీదు శ్రీస్వామివార్ల జ్ఞాపిక, లడ్డు ప్రసాదాలను అందజేశారు.


## పాలకొల్లులో విద్యార్థి అదృశ్యం



**పాలకొల్లు, మే 13 (జనస్వరం) :** పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు కొత్తపేట 22వ వార్డుకు చెందిన శివరాత్రి ప్రకాష్ (15) ఈనెల 8వ తేదీ నుండి కనబడడం లేదని కుటుంబ సభ్యులు గురువారం విలేకరులకు తెలిపారు. పాలకొల్లు పట్టణ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేయడం జరిగిందని, పోలీసులు విచారణ చేస్తున్నారని తెలిపారు. కనపడకుండా పోయిన విద్యార్థి, స్థానిక హెబ్రోన్ రెసిడెన్షియల్ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికీ.. ప్రకాష్‌కు సంబంధించి ఎలాంటి ఆచూకీ లభించలేదని, ఎవరికైనా విద్యార్థి ఆచూకీ తెలిస్తే 9381470496, 9949806934, 8008424954 నెంబర్లకు సమాచారం అందించాలని విద్యార్థి బంధువులు కోరారు.

## కోవూరును ఇండస్ట్రియల్ హబ్‌గా మారుస్తాం

### ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



**కోవూరు, మే 13 (జనస్వరం) :** నిరుద్యోగ రహిత ఆంధ్ర ప్రదేశ్ సాధన కోసం సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ బాబు నిరంతర కృషి చేస్తున్నారని నియోజకవర్గ ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. నిరుద్యోగ రహిత రాష్ట్రం సాధనకై ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ జాబ్ మేళా ఏర్పాటు చేసిన సందర్భంగా ఆమె మాట్లాడుతూ, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించబడిందన్నారు. జాబ్ మేళాలో యువతకు మార్గదర్శనం చేస్తూ, తల్లితండ్రుల ఆకాంక్షలను నెరవేర్చాలని, సమయాన్ని వృథా చేయకుండా అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. "సెల్ఫ్-ఎంప్లాయ్‌మెంట్ ద్వారా యువత స్వయం ఉపాధి దిశగా కూడా కృషి చేయాలని" ఆమె వ్యాఖ్యానించారు. ప్రధానంగా, కోవూరు నియోజకవర్గాన్ని ఇండస్ట్రియల్ హబ్ గా మార్చే దిశగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి దృష్టి పెట్టి, సీఎం చంద్రబాబు సహకారంతో పరిశ్రమల స్థాపనపై కృషి చేస్తున్నారని ఆమె తెలిపారు. అందరికీ అవగాహన కల్పిస్తూ, "విభిన్న ఉద్యోగ అవకాశాలను వదిలి ఏసీ రూములు, 4 డిజిట్ శాలరీలు ఆశించడం సరైంది కాదు," అని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో, స్కిల్ డెవలప్మెంట్ అధికారి ఖయ్యూం ఖాన్, సెట్నల్ అధికారి నాగేశ్వరరావు, జిల్లా ఎంప్లాయ్మెంట్ అధికారి వినయ్ కుమార్, బుచ్చి మున్సిపల్ చైర్ పర్సన్ మోర్ల సుప్రజ, మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ, తహసిల్దార్ అంబటి వెంకటేశ్వర్లు, ఎంపీడీవో శ్రీహరి, టీడీపీ నాయకులు బత్తల హరికృష్ణ, ఎం.వి శేషయ్య, కోడూరు కమలాకర్ రెడ్డి, టంగుటూరి మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కిషోర్ బాలికల సాధికారతపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలి

**ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారిణి వెంకటరమణి సూచన**





**చింతపల్లి, మే 13 (జనస్వరం) :** కిషోర్ బాలికలు లక్ష్యాన్ని చేరుకునే దిశగా ముందుకెళ్లేందుకు తల్లిదండ్రుల సహకారం కీలకమని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారిణి జి.వెంకటరమణి అన్నారు. మంగళవారం ఆమె ఐసీడీఎస్ అదనపు ప్రాజెక్ట్ అధికారిణి ఎం.రామలక్ష్మితో కలిసి మండలంలోని కొత్తపాలెం, తాజంగి సచివాలయాల పరిధిలోని టి కోరుకొండ, బలబద్రం అంగన్వాడి కేంద్రాలను సందర్శించారు. తొలిత అంగనవాడి కేంద్రాల్లోని రికార్డులను పరిశీలించిన అనంతరం, వేసవి సెలవుల సందర్భంగా 19 ఏళ్ల లోపు బాలికల భద్రత అంశంపై తల్లిదండ్రులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలికలు తల్లిదండ్రుల అనుమతి లేకుండా బంధువుల వద్దకు లేదా ఇతర ప్రాంతాలకు వెళ్లకూడదని సూచిస్తూ, వారి భద్రత కోసం ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్లు గౌహరున్నీషా, గౌరీ, విజయకుమారి, అప్పలనర్సమ్మ కొత్తపాలెం, తాజంగి అంగన్వాడి కార్యకర్తలు, గ్రామస్థులు, కిషోర్ బాలికలు పాల్గొన్నారు.

# కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి చేతుల మీదుగా క్రీడా పరికరాలు పంపిణీ



**నెల్లూరు, మే 13 (జనస్వరం) :** రూరల్ నియోజకవర్గ పరిధిలోని ఏ.సి.సుబ్బారెడ్డి స్టేడియంలో నెల్లూరు జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంప్‌ల నిర్వహణలో భాగంగా, క్యాంప్ ఇన్చార్జులకు క్రీడా పరికరాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా, కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వడం అభినందనీయం అని అన్నారు. సమ్మర్ క్యాంపులను నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో క్రీడలపై ఆసక్తి పెంచేందుకు, భవిష్యత్తులో మంచి క్రీడాకారులుగా ఎదిగేందుకు ప్రభుత్వం అన్ని విధాల సహాయాన్ని అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, యువ నాయకులు, మంత్రి నారా లోకేష్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 27వ డివిజన్ కార్పొరేటర్ భీమినేని మురహరి, జిల్లా ఒలంపిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు మహేష్ రెడ్డి, డిఎస్‌డిఓ. ఇతిరాజు, క్లస్టర్ ఇంచార్జ్ షంషుద్దీన్, టీడీపీ నాయకులు పాములు సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


# రెండు ప్రాణాలను బలిగొన్న నిందితుడు అరెస్ట్

**జికె వీధి సీఐ వరప్రసాద్**



**చింతపల్లి/సీలేరు, మే 13 (జనస్వరం) :** రెండు హత్యలతో చింతపల్లి క్యాంపు గ్రామంలో తీవ్ర ఉద్రిక్తతకు కారణమైన నిందితుడు వంతల గెన్ను ఎట్టకేలకు పోలీసుల చెయ్యిలో పడినట్టు జీకే వీధి సీఐ వరప్రసాద్ తెలిపారు. ఆదివారం అర్ధరాత్రి సీలేరు పంచాయతీ చింతపల్లి క్యాంపులో వంతల గెన్ను తన బంధువులను దారుణంగా హత్య చేసి, మరొకరిని తీవ్రంగా గాయపర్చిన ఘటన కలకలం రేపింది. మంగళవారం నిందితుడిని అరెస్ట్ చేసి, బుధవారం రిమాండ్‌కు తరలించి కోర్టులో హాజరుపరచనున్నట్లు వెల్లడించారు. హత్యకు గురైన కిముడు కృష్ణ అలియాస్ కుంజొ కిముడు రాజు, మరో బామ్మర్ది, గెన్ను ఇంటికి వచ్చిన సందర్భంలో చోటుచేసుకున్న ఘర్షణ క్షణాల్లోనే రక్తపాతానికి దారితీసినట్లు పోలీసులు పేర్కొన్నారు. పరారీలో ఉన్న గెన్నును ఫిల్టర్ ఆఫీస్ సమీపంలోని కొండ ప్రాంతంలో పొదలలో దాగి ఉన్నాడన్న సమాచారం మేరకు మంగళవారం రెవెన్యూ, పోలీస్ శాఖ సమన్వయంతో ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేసి అదుపులోకి తీసుకున్నామన్నారు. 2013లోనూ హత్య కేసులో నిందితుడిగా ఉన్న గెన్ను తాజాగా మరో రెండు హత్యలకు పాల్పడిన విషయాన్ని దృష్టిలో ఉంచుకుని తీవ్ర స్థాయిలో విచారణ జరుపుతామని సీఐ వరప్రసాద్ స్పష్టం చేశారు. మృతదేహాలకు మంగళవారం చింతపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# బీఎస్సార్, నీలపాల పేరుతో క్రికెట్ టోర్నమెంట్




**కైకలూరు, మే 13 (జనస్వరం) :** యువతలో క్రీడా స్ఫూర్తిని నింపేందుకు బీఎస్సార్, ఎన్వై పేర్లతో మెగా టెన్నిస్ బాల్ టోర్నమెంట్ను ఏర్పాటు చేశారు. ఈ క్రీడ లను బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, టీడీపీ నాయకులు బూరుబోయిన శ్రీనివాసరావు, నీలపాల నరేష్ యాదవ్‌లు ప్రారంభించారు. ముందుగా టోర్నమెంట్ రిబ్బన్ ను కట్ చేసి తొలి బాల్‌ని బ్యాట్‌తో ఆడి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనిషికి క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు ఆరోగ్యం కూడా కలుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ క్రీడలపై మక్కువతో ఉండాలని, అప్పుడే సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని తెలిపారు. అనంతరం నిర్వాహకులు మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయిలో మొత్తం 40 జట్లు పోటీ పడతాయని తెలిపారు. ఎనిమిది ఓవ ర్లకు పోటీ ఉంటుందన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ. 25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు అందిస్తామని పేర్కొన్నారు. ప్రారంభం రోజున చావలిపాడు – మండవల్లి జట్ల మధ్య జరిగిన పోటీ డ్రాగా ముగిసింది.

# రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధికి ఎన్డీయే కూటమి ప్రభుత్వ కృషి

**ఎంపీ కేశినేని శివనాథ్**



**విజయవాడ, మే 14 (జనస్వరం) :** రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చెందించే దిశగా ఎన్డీయే కూటమి ప్రభుత్వమే సక్రమ దిశలో ముందుకు సాగుతోందని, ప్రతి నియోజకవర్గానికీ ఒక పరిశ్రమ తీసుకురావాలన్న దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) పేర్కొన్నారు.

**నోవోటెల్‌లో "క్రెడాయ్ క్రౌనింగ్ ది టార్చ్ బేరర్ 2025-2027":** విజయవాడ గురునానక్ కాలనీలోని నోవోటెల్ హోటల్‌లో జరిగిన "క్రెడాయ్ క్రౌనింగ్ ది టార్చ్ బేరర్ 2025-2027" కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రులు నారాయణ, కొల్లు రవీంద్ర, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు బొండా ఉమా మహేశ్వరరావు, గద్దె రామ్మోహన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ "అమరావతి ప్రజల కలల రాజధాని. ఇది దేశంలోనే చక్కటి ప్లాన్‌తో రూపుదిద్దుకుంటున్న రాజధాని. అభివృద్ధి విజయవాడ, అమరావతిలో మాత్రమే కాకుండా, విశాఖపట్నం, తిరుపతి, రాజమండ్రి, అనంతపురం నగరాలవైపు కూడా ప్రభుత్వం దృష్టి సారించింది," అని తెలిపారు.

**విశాఖపట్నంలో సాఫ్ట్‌వేర్, ఏఐ పరిశ్రమలు :**
విశాఖపట్నంలో సాఫ్ట్‌వేర్ పరిశ్రమలతో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో పెట్టుబడులు రాబట్టేందుకు ప్రణాళిక సిద్ధ మవుతోందని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రతి నియోజకవర్గానికి పరిశ్రమ తీసుకురావడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు పనిచేస్తున్నారని వివరించారు.

**బందరు పోర్ట్, డిఫెన్స్ ఇండస్ట్రీ, ఇండస్ట్రీ హబ్‌లు :**
త్వరలో నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో ఇండస్ట్రీ హబ్‌లు, బందరు పోర్ట్‌తోపాటు డిఫెన్స్ ఇండస్ట్రీ ఏర్పాటుకానుందని వెల్లడించారు. "ప్రపంచంలో అరుదుగా ఉన్న క్వాంటమ్ కంప్యూటింగ్ సిటీ అమరావతిలో రాబోతుంది" అనే ఆయన వ్యాఖ్యలు ఆసక్తికరంగా నిలిచాయి.

**విజయవాడలో సిల్క్ డెవలప్‌మెంట్ సెంటర్ :**
నిర్మాణ రంగ కార్మికులకు, బిల్డర్లకు ఉపయోగపడే విధంగా విజయవాడలో సిల్క్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేసే పనులు కూడా ప్రారంభమయ్యాయని తెలియజేశారు.

**మంత్రి నారాయణ పాత్రపై ప్రశంసలు :**
మంత్రి నారాయణ విశేష కృషిని ఎంపీ ప్రశంసించారు. "వర్ష కాలంలో రాత్రి, పగలు తేడా లేకుండా ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు నారాయణ ఎంత శ్రమించారో రాష్ట్రం చూసింది. ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా మంత్రి నారాయణ పని చేస్తున్నారు" అని కొనియాడారు.

**వ్యాపార వాతావరణానికి అనుకూల పాలసీలు :**
ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న పాలసీలను అధ్యయనం చేసి, ఆ అనుభవాలను ఆధారంగా తీసుకుని రాష్ట్ర బిల్డర్ల కోసం ఉత్తమ పాలసీ తీసుకొచ్చారన్నారు. అమరావతి రీస్టార్ట్ ప్రోగ్రాం కూడా నారాయణ చేతుల మీదుగా జరిగిందన్నారు.

**ప్రభుత్వం పరంగా హామీ :**
రాష్ట్ర ప్రభుత్వం వ్యాపారవేత్తలకు, పారిశ్రామికవేత్తలకు, బిల్డర్లకు పూర్తిగా అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. అభివృద్ధి కోసం వచ్చిన అవకాశాలను పట్టుకోమని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో క్రెడాయ్ నేషనల్ ప్రెసిడెంట్ జి. రామిరెడ్డి, క్రెడాయ్ ఏపీ ప్రెసిడెంట్ బాయన శ్రీనివాసరావు, జనరల్ సెక్రటరీ దాసరి రాంబాబు, ఇతర సభ్యులు, వివిధ జిల్లాల నుండి విచ్చేసిన క్రెడాయ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# నాటు తుపాకీ మందు పేలి ముగ్గురికి గాయాలు



**కైకలూరు, మే 13 (జనస్వరం) :** మండలంలోని రామవరం గ్రామంలో నాటు తుపాకీ మందు పేలి ముగ్గురికి తీవ్ర గాయాలైన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు తమిళనాడు రాష్ట్రం నుంచి కైకలూరు మండలం రామవరంలో ఆక్వా చెరువులపై పక్షులను బెదిరించటానికి వలస వచ్చిన పక్షుల వేటగాళ్లు గ్రామంలోనే అద్దె ఇంట్లో నివసిస్తున్నారు. ఈ తరుణంలో మంగళవారం తెల్లవారుజామున ఇంట్లో నాటు తుపాకీలో ఉపయోగించే మందు తయారు చేస్తూ ఉండగా ఒక్కసారిగా మందు గుండు సామాగ్రి పేలింది.ప్రమాదంలో చరణ్ ,సతీష్ ,మణి అనే ముగ్గురు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి.భారీ శబ్దం రావడంతో భయాందోళనకు గురైన స్థానికులు క్షతగాత్రులను హుటాహుటిన కైకలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అక్కడి నుంచి ఏలూరు ఆసుపత్రులకు తరలించారు.సంఘటనా స్థలానికి కైకలూరు టౌన్ సిఐ కృష్ణ రూరల్ ఎస్ఐ రాంబాబు, పోలీస్ సిబ్బంది చేరుకుని వివరాలు నమోదు చేసుకుని విచారించారు.

# భైరవునిపాడులో 16వ శతాబ్దం నాటి వీరభద్రుడి విగ్రహం



**విజయవాడ, మే 13 (జనస్వరం) :** పల్నాడు జిల్లా మాచర్ల మండలం భైరవునిపాడులో క్రీ.శ 16వ శతాబ్దానికి చెందిన చిన్న వీరభద్రుడి శిల్పం బయటపడిందని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా సీఈఓ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన మున్నంగి జగన్నాథం ఇచ్చిన సమాచారంతో ఆయన మంగళవారం భైరవునిపాడు శివాలయంలో భద్రపరిచిన ఆ విగ్రహాన్ని పరిశీలించారు.

# సీఎంకు కొత్త హెలికాప్టర్ కొనుగోలుపై కమిటీ



**అమరావతి, మే 13 (జనస్వరం) :** రాష్ట్ర ముఖ్యమంత్రి, ఇతర ప్రముఖుల ప్రయాణాల కోసం వినియోగంలో ఉన్న హెలికాప్టర్ పనితీరు సమీక్షించి మార్పు అవసరమైతే సరైన మోడల్స్‌ను సూచించేందుకు నిపుణుల కమిటీ ఏర్పాటు చేస్తూ సీఎస్ విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ సాధారణ పరిపాలన శాఖ ప్రధాన కార్యదర్శి(పొలిటికల్) చైర్మన్‌గా ఉన్న ఈ కమిటీలో ఆర్థిక శాఖ కార్యదర్శి, ఇంటెలిజెన్స్ అదనపు డీజీ, హైదరాబాద్‌లోని డీజీసీఏ కార్యాలయ ప్రతినిధి సభ్యులు. ఏపీ ఏవియేషన్ కార్పొరేషన్ ఎండీ కన్వీనర్‌గా ఉంటారు. ఏపీ పోలీసు శాఖ, ఏవియేషన్ కార్పొరేషన్ నుంచి వచ్చిన ప్రతిపాదనల మేరకు కొత్త హెలికాప్టర్ కొనుగోలు ఎంపిక కోసం కమిటీ ఏర్పాటు చేసినట్లు జీవోలో ప్రభుత్వం పేర్కొంది.

# చార్మినార్ చెంత.. అందాల పుంత

- **ప్రపంచ సుందరి పోటీదారుల హెరిటేజ్ వాక్**
- **మినార్లను ప్రత్యక్షంగా తిలకించి తన్మయత్వం**
- **నేడు ఓరుగల్లు పర్యటనకు సుందరీమణులు**

**హైదరాబాద్, మే 13 (జనస్వరం) :** ప్రపంచంలోని అందమంతా ఒక్కచోటకు చేరింది. ప్రఖ్యాతిగాంచిన చార్మినార్ వద్ద సందడి చేసింది. మిస్ వరల్డ్ పోటీల కోసం పలు దేశాల నుంచి తరలివచ్చిన అందగత్తెలు మంగళవారం సాయంత్రం చార్మినార్ వద్ద హెరిటేజ్ వాక్‌లో పాల్గొన్నారు. ఇక్కడి చారిత్రక కట్టడాలు, వ్యాపార, వాణిజ్య కేంద్రాలను పరిశీలిస్తూ ఉత్సాహంతో ఉరకలేశారు. ఆయా దేశాల సంప్రదాయ దుస్తులను ధరించి చార్మినార్‌కు వచ్చిన ముద్దుగుమ్మలకు అరబిక్ సంప్రదాయ వాయిద్యాలు, మర్ఫా సంగీతంతో కళాకారులు స్వాగతం పలికారు. లయబద్ధంగా చేసిన మర్ఫా సంగీతానికి పలువురు సుందరీమణులు ఆనందోత్సాహంతో అభివాదం చేస్తూ స్టెప్పులేస్తూ ప్రత్యేక వేదికపైకి చేరుకున్నారు. వేదిక వద్ద తెలుగు సంప్రదాయం ప్రకారం పర్యాటక అధికరారుల బృందం వారికి స్వాగతం పలికింది. ఓవైపు మర్ఫా సంగీతం, మరోవైపు స్థానికుల కేరింతల మధ్య ముద్దుగుమ్మలు చేసిన సందడితో చార్మినార్ పరిసరాలు సరికొత్త అందాన్ని సంతరించుకున్నాయి. అమెరికా, యూరప్, ఆఫ్రికా, ఆసియా దేశాలకు చెందిన 109 మంది అందగత్తెలు చార్మినార్ ఎదుట ఏర్పాటు చేసిన ప్రత్యేక మెట్ల వేదికపై వరుస క్రమంలో చేరుకుని చిరునవ్వులు చిందిస్తూ ఫొటో షూట్‌కు హాజరయ్యారు. అనంతరం చార్మినార్‌లోకి ప్రవేశించి అద్భుత కట్టడాన్ని పరిశీలించారు. ఉత్తర-దక్షిణ భారత రాష్ట్రాల సంస్కృతి, సమ్మిళిత సంప్రదాయాలకు కేంద్రంగా నిలిచిన హైదరాబాద్ నగర వైభవ ప్రాభవాన్ని ప్రపంచవ్యాప్తంగా పరిచయం చేస్తూ ఐకాన్‌గా నిలిచిన చార్మినార్ నిర్మాణంలోని సుందర లతామల్లికల కుడ్య చిత్రాలు, నగిషీలను చూసి ముగ్దులయ్యారు. సొగసైన కట్టడం నిర్మాణ శైలిని పరిశీలించి.. చారిత్రక ప్రాశస్త్యాన్ని తెలుసుకుని ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

**లాడ్‌బజార్ దుకాణాల సందర్శన :**
చార్మినార్‌ను పరిశీలించిన అనంతరం ప్రపంచ సుందరి పోటీదారులు లాడ్‌బజార్‌లోకి ప్రవేశించారు. అక్కడి వ్యాపారులు తమ దుకాణాల్లో ముత్యాలు, రత్నాలు పొదిగిన రంగురంగుల డిజైన్‌ల లక్కగాజులను అందంగా అలంకరించారు. ఈ దుకాణాలను సందర్శించిన సుందరీమణులు అక్కడ ప్రదర్శించిన లక్కగాజులు, మేలిమి ముత్యాల హారాలు, అలంకరణ వస్తు సామగ్రిని పరిశీలించారు. హైదరాబాద్ ప్రత్యేక డిజైన్ మట్టిగాజులు, పెళ్లి, పేరంటాళ్ల సందర్భంలో వినియోగించే ప్రత్యేక అలంకరణ వస్తు సామగ్రి వివరాలను, వాటిని ధరించే తీరును వ్యాపారులను అడిగి తెలుసుకున్నారు. ఆయా డిజైన్ గాజులను కొనుగోలు చేసేందుకు సుందరీమణులు ఎంపిక చేసుకోగా.. వ్యాపారులు వారి వద్ద డబ్బు తీసుకోకుండా కానుకగా అందించారు. అక్కడే లక్కగాజుల తయారీ ప్రక్రియను ముద్దుగుమ్మలు పరిశీలించారు. హస్త కళాకారులతో చేయి కలిపి అభినందించారు. కాగా, చార్మినార్ వద్ద మిస్‌వరల్డ్ పోటీదారులతో ఏర్పాటు చేసిన హెరిటేజ్‌వాక్‌తో హైదరాబాద్ నగర సాంస్కృతిక వారసత్వం, వైభవ ప్రాభవ సౌందర్యాన్ని ప్రపంచానికి మరోసారి తెలియజేసినట్లయింది.

**వామపక్ష మహిళా నేతల హౌస్ అరెస్టు :**
చార్మినార్ వద్ద ప్రపంచ సుందరి పోటీదారుల హెరిటేజ్ వాక్ నేపథ్యంలో మంగళవారం వామపక్ష ప్రజాసంఘాలకు చెందిన పలువురు మహిళా నేతలను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. అందాల పోటీలను వామపక్ష విద్యార్థి, యువజన, మహిళా సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తుండడంతో పోలీసులు ముందుజాగ్రత్త చర్యలు చేపట్టారు. హిమాయత్‌నగర్‌లోని పీవోడబ్ల్యూ నాయకురాలు సంధ్య, నగర కార్యదర్శి వరలక్ష్మిని గృహ నిర్బంధం చేశారు. రాంనగర్‌లోని మార్క్స్ భవనం, బాగ్‌లింగంపల్లి ఐద్వా కార్యాలయం, ఖైరతాబాద్‌లోని ఏఐఎంఎస్ఎస్ ఆఫీసుల వద్ద కూడా పోలీసులు పహారా కాశారని ప్రజాసంఘాల నేతలు తెలిపారు.

**చేతికి గాజులు తొడుక్కుని.. మెడలో దండలు వేసుకుని.. :**
లక్కగాజులకు పెట్టింది పేరుగా నిలిచే పాతబస్తీలోని లాడ్ బజార్‌ను మిస్‌వరల్డ్ పోటీదారులు సందర్శించారు. ఇరుకు గల్లీలో రెండు వైపులా ఉన్న గాజుల షాపులు, ముత్యాలహారాల దుకాణాలు, సంప్రదాయ పెళ్లి దుస్తులు, మెహిందీ కోన్లను కొనుగోలు చేసి సందడి చేశారు. ఆయా దుకాణాల్లో తమకు నచ్చిన వస్తువులను కొనుగోలు చేశారు. అధికారులు ముందస్తుగా ఎంపిక చేసిన దుకాణాలకు వెళ్లిన ముద్దుగుమ్మలు.. వాటిలోని వస్తువులను తిలకించి పులకించారు. ప్రధానంగా లక్కగాజులు, మట్టిగాజులను చేతికి తొడుక్కుని సంతోష పడ్డారు. మరికొందరు ముత్యాల దండలను మెడలో వేసుకుని తన్మయత్వం పొందారు. మరికొందరు సంప్రదాయ దుస్తులు, దుపట్టా, లెహంగాలను కొనుగోలు చేశారు. తమ వద్ద ఇండియన్ కరెన్సీ లేకపోవడంతో డెబిట్ కార్డుల ద్వారా గాజులు, ముత్యాల దండలను తీసుకున్నారు. కాగా, తమ దుకాణానికి వచ్చిన విదేశీ వనితలకు పలువురు నిర్వాహకులు బహుమతిగా చిన్నపాటి ముత్యాల దండలను ఇచ్చారు. అంతకుముందు పలువురు ఉస్మానియా బిస్కెట్లు తిని, ఇరానీ చాయ్ తాగారు. మిస్‌వరల్డ్ పోటీదారుల పర్యటన నేపథ్యంలో లాడ్‌బజార్ రోడ్డును అందంగా తీర్చిదిద్దారు. నాలుగు రోజుల వరకు గతుకులుగా ఉన్న రోడ్డుపై బీటీ వేశారు. అలాగే మధ్యలో ఆకర్షణీయమైన వస్తువులను ఉంచారు.

**పోలీసుల భారీ బందోబస్తు.. :**
చార్మినార్, లాడ్‌బజార్‌లో మిస్‌వరల్డ్ పోటీదారుల హెరిటేజ్ వాక్ నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. చార్మినార్ నలుదిక్కులైన గుల్జార్‌హౌస్, లాడ్ బజార్, సర్దార్ మహల్‌చౌరస్తా, చార్మినార్ బస్టాండ్ వరకు బారికేడ్లు ఏర్పాటు చేసి వాహనదారులు, సంద ర్శకులను కట్టడి చేశారు. చార్మినార్ ప్రాంగణంలోకి ఎక్కువ మందిని రాకుండా అడ్డుకున్నారు. కేవలం కొన్ని దుకాణాలకు మాత్రమే అనుమతించారు. కాగా, హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ పోలీసు అధికారులతో వచ్చి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మధ్యాహ్నం 3.15 గంటల నుంచి చార్మినార్ ప్రాంగణంలో అప్పటికే ఉన్న సందర్శకులు, కొనుగోలుదారులను పోలీసులు బయటికి పంపించారు. మొత్తంగా మూడంచెల భద్రత చేపట్టారు. అందాలభామలు చార్మినార్ నుంచి వెళ్లిన తర్వాత సాయంత్రం 6.30 గంటల నుంచి సందర్శకులను అనుమతించారు.

**నేడు ఓరుగల్లుకు సుందరీమణులు :**
ప్రపంచ సుందరి పోటీదారులు బుధవారం ఓరుగల్లును సందర్శించనున్నారు. కాకతీయుల కళా వైభవానికి నిదర్శనంగా నిలుస్తున్న వరంగల్ నగరంలో పర్యటించనున్నారు. అందాలభామల రాక కోసం అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది. వరంగల్ కోట, వెయ్యి స్తంభాల ఆలయం, రామప్ప ఆలయాలను విద్యుత్ కాంతులతో అలంకరించారు. ఈ సందర్భంగా భారీ భద్రత ఏర్పాటు చేశారు.